# హైదరాబాద్ పల్స్

జాతీయ తెలుగు దినపత్రిక

దేశం ముఖ్యం.... దేశ ప్రజల భద్రత ముఖ్యం.... మతం కాదు...



విలేకరులు కావలెను

హైదరాబాద్ పల్స్ జాతీయ తెలుగు దినపత్రిక

"ఎంతకైనా తెగిస్తాం... ప్రజల గొంతుకై నిలుస్తాం" అనే నినాదంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించిన హైదరాబాద్ పల్స్ జాతీయ దినపత్రికకు తెలుగు రాష్ట్రాలలోని అన్ని మండల, నియోజకవర్గాల, జిల్లాల వ్యాప్తంగా విలేకరులు కావలెను. * సీనియర్లకు ప్రాధాన్యత కలదు.

సంప్రదించవలసిన ఫోన్ నెంబర్స్

- Dr. RAHUL KUMAR 9989834020
- K. Naveen Kumar 94406 53413

www.hyderabadpulse.com HyderabadPulse @hyderabad



సీఈఓ : కె నవీన్ కుమార్ | ఎడిటర్: డా. రాహుల్ కుమార్ | సంపుటి: 03 | సంచిక : 105 | పేజీలు : 08 | బుధవారం | 22-04-2026 | వెల :4/-

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD, SANGAREDDY, WARANGAL, MANCHIRYAL, VIJAYWADA, GUNTUR, KURNOOL, TIRUPATI, KADAPA, BENGALURU, MUMBAI, CHENNAI, DELHI.


## మూగబోయిన మైకులు

### తమిళనాడులో ముగిసిన ఎన్నికల ప్రచార గడువు...




2

- తమిళనాడులో 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో పోలింగ్
- బెంగాల్‌లో 152 స్థానాలకు పోలింగ్
- మే 4వ తేదీన వెల్లడి కానున్న ఫలితాలు

హైదరాబాద్ పల్స్,డెస్క్

తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచార హోరుకు మంగళవారం సాయంత్రం 6 గంటలకు తెరపడింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల కీలకమైన "నిశ్శబ్ద సమయం" (సైలెన్స్ పీరియడ్) అధికారికంగా ప్రారంభమైంది. దీంతో బహిరంగ సభలు, ర్యాలీలు, ప్రసంగాలకు ఫుల్‌స్టాప్ పడింది. తమిళనాడుతో పాటు పశ్చిమ బెంగాల్‌లో 152 స్థానాలకు ఎల్లుండి పోలింగ్ జరగనుంది. ఏప్రిల్ 23న తమిళనాడులో ఒకే విడతలో పోలింగ్ జరగనుండగా, బెంగాల్ లో తొలి దశ పోలింగ్ జరగనుంది.ప్రస్తుత డీఎంకే ప్రభుత్వ పదవీకాలం మే 10న ముగియనుండటంతో, మార్చి 15న ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించింది. ఏప్రిల్ 23న ఒకే విడతలో పోలింగ్, మే 4న ఓట్ల లెక్కింపు జరపనున్నట్లు వెల్లడించింది. ఈ నేపథ్యంలో, గత కొన్ని వారాలుగా రాష్ట్రంలో రాజకీయ పార్టీలు హోరాహోరీగా ప్రచారం చేశాయి. అధికార డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్, అన్నాడీఎంకే నేతృత్వంలోని నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. వీటికి తోడు నామ్ తమిళర్ కట్చి, నటుడు విజయ్ స్థాపించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలు కూడా స్వతంత్రంగా బరిలో నిలవడంతో ఈసారి చతుర్ముఖ పోటీ ఆసక్తికరంగా మారింది. మండుటెండలను సైతం లెక్కచేయకుండా అగ్రనేతలంతా రాష్ట్రవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించి, భారీ బహిరంగ సభల్లో పాల్గొన్నారు.ప్రచారం ముగియడంతో, స్వేచ్ఛాయుతమైన,

---

### కేసీఆర్ ఆదేశాల మేరకే

## ఢిల్లీకి వెళ్లాను.. కానీ!



2

- తన ఢిల్లీ పర్యటనపై రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని విమర్శ
- విషయం ఉన్నవారు ఎవరూ ఇలాంటి పనులు చేయరన్న హరీశ్ రావు
- నేడుసుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణ ఉందని వెల్లడి

---



2

### తెలంగాణ

## దరిద్రం పోతుంది

- కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతం కావడం చూడాలని కోరుకుంటున్నారన్న ధర్మపురి అర్వింద్
- కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవితలే హింసిస్తున్నారని వ్యాఖ్య
- వారికి ఫ్లైట్ టిక్కెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్, తెలంగాణ దరిద్రం పోతుందన్న అర్వింద్
- కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్న అర్వింద్

---

### పిల్లి శాపనార్థాలకు

## భయపడం

- జీవన్ రెడ్డికి 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చింది కాంగ్రెసే..
- కేసీఆర్ పిల్లి శాపనార్థాలకు భయపడం
- ఎవరి దయాదాక్షిణ్యాలతోనో తాము అధికారంలోకి రాలేదన్న పొన్నం
- కాంగ్రెస్ లో దశాబ్దాల పాటు ఉండి అవమానం జరిగిందని చెబుతున్నారంటూ జీవర్ రెడ్డిపై ఫైర్
- బీఆర్ఎస్ ఆర్థిక విధ్వంసం వల్లే కొన్ని పథకాలు ఆలస్యమయ్యాయని వ్యాఖ్య



హైదరాబాద్ పల్స్,హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పైనా, బీఆర్ఎస్ పార్టీలో నిన్న చేరిన జీవన్ రెడ్డిపైనా మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శలు గుప్పించారు. ప్రతిపక్ష నాయకుడు ప్రభుత్వానికి సలహాలు ఇవ్వాలే కానీ, విమర్శలకు మాత్రమే

---

## రేవంత్ రెడ్డి 'యూ-టర్న్' తీసుకున్నారు

- ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని గతంలో రేవంత్ అన్నారన్న సంజయ్
- లక్ష కోట్ల అవినీతి జరిగిందని గగ్గోలు పెట్టారన్న కేంద్ర మంత్రి
- ఇప్పుడు కేవలం రూ. 9 వేల కోట్ల స్కామ్ జరిగిందని సీబీఐకి లేఖ రాశారని విమర్శ

2



---

## మోదీని ఉగ్రవాది అనలేదు..

### నా వ్యాఖ్యలను వక్రీకరించారు:మల్లికార్జున ఖర్గే

- ప్రభుత్వమే ప్రజలను, సంస్థలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పానన్న ఖర్గే
- ఎన్నికల సంఘం బీజేపీ అనుబంధ కార్యాలయంలా పనిచేస్తోందని ఆరోపణ
- మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ వ్యతిరేకించలేదని వెల్లడి
- డీలిమిటేషన్‌తో ముడిపెట్టడాన్నే వ్యతిరేకించామని స్పష్టీకరణ
- దర్యాప్తు సంస్థలను, ధనబలాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం

2



---



2

### గోర్కా సమస్యకు 6 నెలల్లో

## పరిష్కారం..

- గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం.. బీజేపీతోనే అది సాధ్యం: అమిత్ షా
- దశాబ్దాల నాటి గోర్కా సమస్యకు పరిష్కారం చూపుతామన్న అమిత్ షా
- గోర్కా ప్రజల మనోభావాలను అర్థం చేసుకునే పార్టీ బీజేపీయేనని వ్యాఖ్య
- ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారన్న అమిషా

---

### కలవాలనుకుంటే

## అభ్యంతరం లేదు



2

- ఇరాన్ నాయకత్వం నేరుగా నన్నే కలవాలనుకుంటే అభ్యంతరం లేదు: ట్రంప్
- తమ వద్ద చాలామంది సమర్థవంతమైన వ్యక్తులుల ఉన్నారన్న ట్రంప్
- అమెరికా, ఇరాన్ రెండో విడత చర్చలపై ఉత్కంఠ
- వాషింగ్టన్ మితిమీరిన డిమాండ్లు పెడుతోందన్న ఇరాన్

---

### సీమాంధ్ర నేతల

## చేతుల్లో కీలుబొమ్మ



2

- రేవంత్ రెడ్డి మొదటి నుంచి సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ: జీవన్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు
- 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో ఓటుకు నోటు కేసులో దొరికిపోయారని ఆరోపణ
- మేం పాలన మార్పు కోరుకుంటున్నాం కానీ రేవంత్ రెడ్డికి కీడు జరగాలని కోరుకోవడం లేదని వ్యాఖ్య
- కేసీఆర్ లేకుంటే ఆయన ముఖ్యమంత్రి అయ్యేవాడా అని ప్రశ్న

---



2

### భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారం: మంత్రి పొంగులేటి

---




### కాళేశ్వరం కమిషన్‌పై విచారణ..

2

హైకోర్టు తీర్పుపై ఉత్కంఠ

# కేసీఆర్ ఆదేశాల మేరకే ఢిల్లీకి వెళ్లాను..

మొదటి పేజీ తరువాయి

తమ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు తాను ఢిల్లీకి వెళ్లానని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. ఆయన చెప్పిన పని కోసమే తాను, వినోద్ కుమార్ తదితరులం వెళ్లామని చెప్పారు. ముఖ్యమంత్రి పెట్టే అక్రమ కేసులను ఎదుర్కోవడానికి, కాళేశ్వరం కేసులపై ఢిల్లీకి వెళ్లి లాయర్లతో చర్చించినట్లు చెప్పారు.కానీ తన ఢిల్లీ పర్యటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎంవో నుంచి లీకులు ఇచ్చారని, మీడియా వాళ్లతో అర్థం లేని బ్రేకింగ్‌లు పెట్టించారని ఆరోపించారు. విషయం ఉన్న వారు ఎవరైనా ఇలాంటి పనులు చేయరని, విషయం లేనివారే ఇలా చేస్తారని విమర్శించారు.

**నేడు ఓటుకు నోటు కేసు విచారణ**

నేడు ఓటుకు నోటు కేసు కూడా సుప్రీంకోర్టులో విచారణకు రానుందని, ఆ కేసు గురించి న్యాయవాదులతో చర్చించామని అన్నారు. ఈ కేసులో నాటి ముఖ్యమంత్రి, హోంమంత్రి కూడా ఇంప్లీడ్ అయ్యారని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ప్రభుత్వం తరఫున అనామక లాయర్‌ను పెట్టారని విమర్శించారు. నిందితుల తరపున మాత్రం ప్రముఖ లాయర్ ముకుల్ రోహత్గీని పెట్టుకున్నారని చెప్పారు. రేపటి విచారణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముద్దాయిగా ఉన్నారని గుర్తు చేశారు. గత నాలుగున్నరేళ్లుగా ఆయన స్టే మీద ఉన్నారని చెప్పారు.రేవంత్ రెడ్డి ఢిల్లీలో రాత్రి రాహుల్ గాంధీతో, ఉదయం బీజేపీ వారితో తిరిగారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ నిన్న బయటకు వచ్చినందనే రెండో విడత రైతు భరోసా నిధులు విడుదల చేశారని అన్నారు. పంట పెట్టుబడిగా ఇవ్వాల్సిన సొమ్మును పంట చేతికి వచ్చాక ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్థాయి, తమ పార్టీ అధినేత కేసీఆర్ స్థాయి ఏమిటో తెలంగాణ ప్రజలకు నిన్నటి బహిరంగ సభలతో అర్థమైందని అన్నారు. కేసీఆర్ జగిత్యాల సభ ప్రసంగాన్ని 36 లక్షలమంది చూస్తే, రేవంత్ రెడ్డి ప్రసంగాన్ని కేవలం 4 లక్షలమంది మాత్రమే చూశారని అన్నారు. రేవంత్ రెడ్డి తెలిసి చేశారో లేక తెలియక చేశారో కానీ కేసీఆర్ సభ సమయంలోనే రేవంత్ రెడ్డి తన సభను ఏర్పాటు చేసుకోవడంతో ఎవరి రేటింగ్ ఏమిటో తెలిసిందని అన్నారు.

# మోదీని ఉగ్రవాది అనలేదు..

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీపై తాను చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం కావడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం స్పష్టత ఇచ్చారు. తాను ప్రధాని మోదీని 'ఉగ్రవాది' అని పిలవలేదని, తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని వివరించారు. మంగళవారం నాడు విలేకరుల సమావేశంలో మాట్లాడిన ఆయన, ప్రస్తుత ప్రభుత్వ హయాంలో నెలకొన్న భయానక వాతావరణాన్ని ఉద్దేశించే తాను ఆ వ్యాఖ్యలు చేశానని తెలిపారు."మోదీ ఉగ్రవాది అని నేను అనలేదు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, సంస్థలను, ఏజెన్సీలను బెదిరించడానికి వాడుకుంటున్నారని చెప్పాను" అని ఖర్గే స్పష్టం చేశారు. దర్యాప్తు సంస్థలతో సహా కీలకమైన వ్యవస్థలన్నీ రాజకీయ ఒత్తిడిలో పనిచేస్తున్నాయని, ఇది ప్రజాస్వామ్య విలువలను బలహీనపరుస్తోందని ఆరోపించారు. ఎన్నికల సంఘం (ఈసీ) కూడా స్వతంత్రంగా వ్యవహరించడం లేదని, బీజేపీకి అనుబంధ కార్యాలయంలా మారిపోయిందని విమర్శించారు.మహిళా రిజర్వేషన్ బిల్లుపై మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఈ బిల్లుకు ఎప్పుడూ మద్దతు ఇస్తోందని పునరుద్ఘాటించారు. అయితే, ఈ బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాము బిల్లును కాదని, డీలిమిటేషన్‌ను తీసుకురావడాన్ని మాత్రమే వ్యతిరేకించామని తెలిపారు. ధనబలం, కండబలం, దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని బీజేపీ రాజకీయ లబ్ధి పొందాలని చూస్తోందని ఆరోపించారు. తమిళనాడులో డీఎంకే నేతృత్వంలోని కూటమి మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

# కలవాలనుకుంటే అభ్యంతరం లేదు

మొదటి పేజీ తరువాయి

ఇరాన్ నాయకత్వం నేరుగా తననే కలవాలనుకుంటే తనకు అభ్యంతరం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా అమెరికా, ఇరాన్ మధ్య జరగాల్సిన రెండో విడత చర్చలపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ మాట్లాడుతూ, ఇరాన్ నాయకత్వంతో నేరుగా సంప్రదింపులు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఆయన పేర్కొన్నారు. వారు కలవాలనుకుంటే తమ వద్ద చాలామంది సమర్థవంతమైన వ్యక్తులు కూడా ఉన్నారని ట్రంప్ తెలిపారు.

**చర్చలు జరపలేం: ఇరాన్**

ప్రస్తుత పరిస్థితుల్లో చర్చలు జరపలేమని ఇరాన్ పార్లమెంటరీ జాతీయ భద్రతా కమిషన్ సభ్యుడు మొహమ్మద్ రెజా వెల్లడించారు. వాషింగ్టన్ మితిమీరిన డిమాండ్లు తమ ముందు ఉంచుతోందని ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే వచ్చే దఫా చర్చలు కూడా సాధ్యం కాకపోవచ్చని అభిప్రాయపడ్డారు.ఇదిలా ఉండగా, అమెరికా సైన్యం నుంచి పదేపదే హెచ్చరికలు వచ్చినప్పటికీ, ఒక ఇరాన్ చమురు ట్యాంకర్ తమ దేశ జలాల్లోకి విజయవంతంగా ప్రవేశించిందని ఇరాన్ సైన్యం ప్రకటించింది. అమెరికా నావికాదళం హెచ్చరికలను పక్కనపెట్టి, సిలిసిటీ అనే ట్యాంకర్ అరేబియా సముద్రం గుండా ప్రయాణించి ఇరాన్ జలాల్లోకి చేరుకుందని తెలిపింది.

# తెలంగాణ దరిద్రం పోతుంది

మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ తన కళ్లతో బీఆర్ఎస్ అంతమవడం చూడాలని తాము కోరుకుంటున్నామని, అది కూడా త్వరలో జరుగుతుందని నమ్ముతున్నామని బీజేపీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. కేసీఆర్‌ను అందరికంటే ఎక్కువగా కేటీఆర్, కవిత, హరీశ్ రావులే హింసిస్తున్నారని ఆరోపించారు. కవిత, కేటీఆర్‌లకు ఫ్లైట్ టిక్కెట్ ఇచ్చి పంపిస్తే కేసీఆర్ దరిద్రంతో పాటు తెలంగాణ దరిద్రం కూడా వదులుతుందని వ్యాఖ్యానించారు.అర్వింద్ రైతుల సమస్యలపై కూడా మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు కేంద్రాల్లో అస్తవ్యస్థ పరిస్థితులు నెలకొన్నాయని విమర్శించారు. రైతుల గోడును పట్టించుకునే వారే కరవయ్యారని అన్నారు. ఈ సందర్భంగా పసుపు రైతులకు ఆయన కీలక హామీ ఇచ్చారు. తాను రాజకీయాల నుంచి తప్పుకునే లోపు పసుపు పంటకు క్వింటాల్‌కు రూ.30 వేల మద్దతు ధర పలికించి తీరుతానని అన్నారు. రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని చెప్పారు.

# గోర్కా సమస్యకు 6 నెలల్లో పరిష్కారం..

మొదటి పేజీ తరువాయి

పశ్చిమ బెంగాల్‌లోని కుర్సియాంగ్‌లో జరిగిన ఎన్నికల సభలో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రసంగిస్తూ... గోర్కా వర్గ ప్రజలకు భారీ భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే దశాబ్దాల కాలం నాటి గోర్కా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆయన స్పష్టం చేశారు.గోర్కా ప్రజల మనోభావాలను, వారి ఆందోళనలను అర్థం చేసుకోగల ఏకైక పార్టీ బీజేపీయేనని, మరే ఇతర పార్టీ కూడా ఈ సమస్యను పరిష్కరించలేదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే గోర్కాల ముఖంలో ఆనందాన్ని చూస్తారని... వారు శాంతియుతంగా జీవించేలా పరిష్కారాన్ని గుర్తిస్తామని హామీ ఇచ్చారు.అయితే, తన ప్రసంగంలో అమిత్ షా ఎక్కడా నేరుగా 'గోర్కాల్యాండ్' లేదా 'ప్రత్యేక రాష్ట్రం' అనే పదాలను వాడకపోవడం గమనార్హం. కేవలం 'సమస్య పరిష్కారం' అనే అంశంపైనే ఆయన దృష్టి సారించారు.

# రేవంత్ రెడ్డి 'యూ-టర్న్' తీసుకున్నారు

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో రేవంత్ రెడ్డి మాట మారుస్తున్నారని ఆరోపించారు. గతంలో ఈ ప్రాజెక్టు ఎందుకూ పనికిరాదని, గోదావరిలో కొట్టుకుపోయిందని విమర్శించిన రేవంత్... ఇప్పుడు దానిపై ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగిందని అప్పట్లో గగ్గోలు పెట్టి, ఇప్పుడు సీబీఐకి కేవలం 9 వేల కోట్ల స్కామ్ జరిగిందని అర్థం లేని లేఖ రాయడం వెనుక మర్మం ఏమిటని ప్రశ్నించారు. అసలు ఏ ఆధారాలను బట్టి సీబీఐ విచారణ చేపట్టాలో సీఎం స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.కేసీఆర్ కుటుంబ సభ్యుల్లో ఒక్కరిపై అయినా ఈ ప్రభుత్వం ఇప్పటి వరకు చర్యలు తీసుకుందా? అని బండి సంజయ్ నిలదీశారు. ఒక్కో మోటారుకు వందల కోట్లు ఖర్చు చేసి విదేశాల నుంచి తెచ్చారని, ఈ అవినీతి అంతా బయటకు రావాల్సిందేనని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు గతంలో కేసీఆర్‌కు ఏటీఎంలా ఉంటే, ఇప్పుడు కాంగ్రెస్‌కు కూడా అలాగే మారిందని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ గతంలో పొత్తులు పెట్టుకున్న చరిత్రను గుర్తు చేస్తూ... బీజేపీపై తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు పలికారు.మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం ద్వారా రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని మహిళలకు తీరని అన్యాయం చేశారని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. కేవలం సోనియా గాంధీ, ప్రియాంకా గాంధీలకు పదవులు ఇస్తే సరిపోతుందా? అని ప్రశ్నిస్తూ సెటైర్లు వేశారు. డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుకుని దక్షిణాదికి అన్యాయం చేస్తోంది రేవంత్, తమిళనాడు సీఎం స్టాలిన్ అని దుయ్యబట్టారు. ప్రస్తుత సీఎం, మాజీ సీఎంల భాష చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

# మూగబోయిన మైకులు

మొదటి పేజీ తరువాయి

నిష్పక్షపాత ఎన్నికల ప్రక్రియను నిర్ధారించేందుకు కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ ఈ మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951లోని సెక్షన్ 126 ప్రకారం, ఏప్రిల్ 21 సాయంత్రం 6 గంటల నుంచి ఏప్రిల్ 23న పోలింగ్ ముగిసే వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయి.ఈ నిబంధనల ప్రకారం, బహిరంగ సభలు, ఊరేగింపులు, ప్రచార సంబంధిత సమావేశాలను నిర్వహించరాదు. టెలివిజన్, రేడియో, వాట్సాప్, ఫేస్‌బుక్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు ఎస్ఎంఎస్‌లు లేదా ఇంటర్నెట్ ద్వారా ఎన్నికల సంబంధిత కంటెంట్‌ను వ్యాప్తి చేయడంపై పూర్తి నిషేధం విధించారు. ఓటర్లను ప్రభావితం చేసే ఉద్దేశంతో సంగీత, నాటక ప్రదర్శనలు వంటి వినోద కార్యక్రమాలను నిర్వహించడం కూడా నిషిద్ధం. ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే రెండేళ్ల వరకు జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉందని అధికారులు హెచ్చరించారు.నియోజకవర్గంలో ఓటర్లు కాని రాజకీయ నాయకులు, పార్టీ కార్యకర్తలు నిశ్శబ్ద సమయం ప్రారంభం కాకముందే ఆ ప్రాంతాన్ని విడిచి వెళ్లాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనల అమలును పర్యవేక్షించేందుకు కళ్యాణ మండపాలు, హాస్టళ్లు, అతిథి గృహాలపై నిఘా కట్టుదిట్టం చేశారు. అభ్యర్థులు, స్టార్ క్యాంపెయినర్లకు జారీ చేసిన వాహన అనుమతులు మంగళవారం సాయంత్రం 6 గంటల తర్వాత చెల్లవు. పోలింగ్ రోజున అభ్యర్థులకు పరిమిత సంఖ్యలో వాహనాలకు అనుమతి ఉంటుంది, వాటిని కూడా రిటర్నింగ్ అధికారులు నియంత్రిస్తారు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి వాహనాలను అద్దెకు తీసుకోవడం లేదా ఉపయోగించడం పూర్తిగా నిషేధం. అభ్యర్థులు పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల దూరంలో ఇద్దరు వ్యక్తులతో మాత్రమే ఎన్నికల బూత్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడ కూడా జనం గుమిగూడటానికి అనుమతి లేదు.

# పిల్లి శాపనార్థాలకు భయపడం

మొదటి పేజీ తరువాయి

పరిమితం కాకూడదని అన్నారు. ఎవరి దయాదాక్షిణ్యాలతోనో తాము అధికారంలోకి రాలేదని, ప్రజలు ఎన్నుకుంటేనే వచ్చామని పొన్నం స్పష్టం చేశారు. ప్రభుత్వం కూలిపోతుందంటూ కేసీఆర్ పెడుతున్న 'పిల్లి శాపనార్థాలకు' భయపడేది లేదని, మరో 10 ఏళ్ల పాటు తెలంగాణలో కాంగ్రెసే అధికారంలో ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ పార్టీ జీవన్ రెడ్డికి ఏకంగా 14 సార్లు బీ-ఫామ్ ఇచ్చి గౌరవించిందని, మరి ఆయన పార్టీకి తిరిగి ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా ఉండి ఇప్పుడు అవమానం జరిగిందని చెప్పడం హాస్యాస్పదమన్నారు. కేసీఆర్ సభ పెట్టారు కాబట్టే తాము రైతు భరోసా నిధులు విడుదల చేశామన్న వాదనను పొన్నం కొట్టిపారేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే కొన్ని పథకాలు ఆలస్యమయ్యాయని, అయినా తమ ప్రభుత్వం ప్రతి హామీని ఒక్కొక్కటిగా నెరవేరుస్తోందని పేర్కొన్నారు.మరోవైపు రాష్ట్రంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మెను విరమించాలని, చర్చలకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కూడా ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# సీమాంధ్ర నేతల చేతుల్లో కీలుబొమ్మ

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆంధ్రా నాయకులకు తొత్తుగా మారిపోయారని నిన్న బీఆర్ఎస్ పార్టీలో చేరిన జగిత్యాల సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి విమర్శించారు. ఆయన మొదటి నుంచి సీమాంధ్ర నాయకుల చేతిలో కీలుబొమ్మగానే ఉంటున్నారని అన్నారు. 2015లో నాటి టీఆర్ఎస్ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలనే కుట్రతో, వేం నరేందర్ రెడ్డిని ఎమ్మెల్సీగా చేయాలనే ఉద్దేశంతో ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డి దొరికిపోయారని పేర్కొన్నారు. ఆయనకు రాజ్యాంగం పట్ల గౌరవం లేదని విమర్శించారు. ఆయన ఆంధ్రా తొత్తులా మారి పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సహకరిస్తున్నారని ఆరోపించారు.రేవంత్ రెడ్డి పాలన పోయి కేసీఆర్ పాలన రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మేం పాలన మార్పు కోరుకున్నాం తప్ప, భౌతికంగా రేవంత్ రెడ్డి కీడును తాము కోరుకోలేదని అన్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణ ముఖ్యమంత్రి అయ్యారంటే అది కేసీఆర్ పుణ్యమే అన్నారు. కేసీఆర్ ఉద్యమించకుంటే తెలంగాణ వచ్చేదా అని ప్రశ్నించారు. అలాంటి ఉద్యమనాయకుడిని పట్టుకుని ఉరితీస్తానని అంటావా అని ప్రశ్నించారు.జగిత్యాలలో కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభ సమయంలోనే రేవంత్ రెడ్డి కావాలని మేడిగడ్డ పర్యటనను పెట్టుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదని, కానీ రేవంత్ రెడ్డి తానే ఎప్పటికీ ముఖ్యమంత్రిగా ఉంటానని చెబుతున్నాడని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం అన్నీ గమనిస్తోందని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికే బీజేపీలో చేరారని... ఎన్డీఏకు, రేవంత్ రెడ్డికి మధ్య చంద్రబాబు వారధిగా ఉన్నారని అన్నారు. తనను చంద్రబాబు కాపాడుతారని ఆయన భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ అధిష్ఠానం ఎందుకు మౌనంగా ఉందో అర్థం కావడంలేదని అన్నారు.నాదెండ్ల భాస్కరరావు అంశం గురించి రేవంత్ రెడ్డి తెలియకుండా మాట్లాడుతున్నారని జీవన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆనాడు నాదెండ్ల భాస్కరరావుకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా నిలిచిందని గుర్తు చేశారు. ఆయనకు మద్దతుగా తాను మంత్రి పదవికి రాజీనామా చేశానని వెల్లడించారు. తనను ఎవరూ తొలగించలేదని, తనంతట తానే రాజీనామా చేశానని అన్నారు. తనతో పాటు ఇందిరాగాంధీ, కాంగ్రెస్ సహా అందరూ నాదెండ్లకు మద్దతుగా నిలిచారని వెల్లడించారు. ఈ విషయం రేవంత్ రెడ్డికి తెలియదేమో అని విమర్శించారు.

# భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారం: మంత్రి పొంగులేటి

మొదటి పేజీ తరువాయి

ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 21 : భూ వివాదాల పరిష్కారంలో తెలంగాణకు కొత్త దిశ సాకారమైందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లాలోని కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని పేర్కొన్నారు. భూభారతి పోర్టల్‌తో భూమి హక్కులకు శాశ్వత భరోసా కల్పించామని చెప్పుకొచ్చారు. ప్రతి భూమికి ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయించామన్నారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ తప్పనిసరి చేస్తూ కొత్త నిబంధన ఉంటుందని స్పష్టం చేశారు.మంగళవారం ఖమ్మం జిల్లాలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. భూభారతి పోర్టల్ రైతులకు భద్రత, కుటుంబాలకు నమ్మకమని తెలిపారు.సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రెవెన్యూ సంస్కరణలు చేపట్టామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. ఐదు మండలాల్లో పైలట్‌గా భూభారతి అమలవుతోందని చెప్పుకొచ్చారు. ల్యాండ్, సర్వే, రిజిస్ట్రేషన్ విభాగాలు ఒకే ప్లాట్‌ఫామ్‌లోకి తీసుకొచ్చామని తెలిపారు. దేశానికి ఆదర్శంగా భూభారతి పోర్టల్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కూసుమంచిలో చారిత్రాత్మకంగా తొలి నమోదు చేశామని వివరించారు. రైతు భూమి హక్కులకు ఓ స్పష్టత ఇచ్చామని.. సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పుకొచ్చారు. సర్వే మ్యాప్‌తో యాజమాన్యంపై ఎలాంటి సందేహం లేకుండా చర్యలు చేపట్టామని అన్నారు. ఆధునాతన టెక్నాలజీతో కచ్చితమైన భూసర్వేలు చేపడతామని.. దశలవారీగా రాష్ట్రమంతా అమలు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# కాళేశ్వరం కమిషన్‌పై విచారణ..

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు.హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు.

# జూన్ 2 లోపు 50 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి ఇవ్వకుంటే ఆందోళనకు సిద్ధం

## పిఆర్టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, సిద్దిపేట జిల్లా :** జూన్ రెండవ తేదీ లోపు 50 శాతం ఫిట్మెంట్ తో పిఆర్సి ఇవ్వకుంటే ఉద్యోగులు ఆందోళనకు సిద్ధమని పిఆర్టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ హెచ్చరించారు. వర్గల్ మండల శాఖ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన మైలారం హెచ్ఎం సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి ఉద్యోగ విరమణ, అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సిఎం రేవంత్ రెడ్డి నిలబెట్టుకోవాలని, మేనిఫెస్టోలో చేర్చిన ఈ సమస్యను జూన్ రెండు లోపు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పిఆర్సి ఉద్యోగులకు ప్రభుత్వమిచ్చే బహుమతి కాదని, సానుభూతితో ఇచ్చేది కూడా కాదని పేర్కొంటూ పెరుగుతున్న ధరల ప్రకారం పిఆర్సి పొందడం ఉద్యోగుల హక్కని తెలిపారు. ఆరు నెలల్లో అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పగా, ప్రస్తుతం ప్రభుత్వం వద్ద నిధులు లేవని ఉద్యోగుల హక్కులు కాలరాస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగులు ప్రజలలో భాగమేనని, సంక్షేమ పథకాలకు రాని నిధుల సమస్య పిఆర్సికి ఎందుకు వస్తుందని నిలదీశారు. చిత్తశుద్ధితో వ్యవహరించి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే వారి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని తెలిపారు. కాగా సుబ్రహ్మణ్యేశ్వర రెడ్డి మూడు దశాబ్దాలు ఉపాధ్యాయునిగా, హెచ్ఎంగా ఉత్తమ సేవలందించడంతోపాటు అంకిత భావం, నిబద్ధతతో పనిచేసే నేటితరం ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సిఆర్టి మాజీ డైరెక్టర్ ఆనంద్ కిషోర్, జిల్లా శాఖ అధ్యక్షులు మల్లుగారి ఇంద్రసేనారెడ్డి, ప్రధాన కార్యదర్శి శశిధర శర్మ, ఎంఈఓ సునీత, హెచ్ఎంల సంఘం జిల్లా అధ్యక్షులు కరీముద్దీన్, సంపాదకవర్గ సభ్యులు రామకృష్ణా రెడ్డి, లక్కిరెడ్డి విజయ, మాజీ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి, భాస్కర్ రెడ్డి, రాచకొండ డిసిపి శ్రీనివాస్, శ్రీమతి రజిత, మండల శాఖ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, కృష్ణ, సౌజన్య, సుభాష్, చంద్ర రెడ్డి, వెంకటేశ్వర్లు, తిరుపతి రెడ్డి, మల్లికార్జున స్వామి, శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



# వేదాంత వైభవం ఆదిశంకరాచార్య : దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతులు

## ఘనంగా శంకరాచార్య జయంతి వేడుకలు

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, జహీరాబాద్ :** ప్రపంచానికి అద్వైత వేదాంతాన్ని బోధించి, "బ్రహ్మ సత్యం జగత్ మిథ్య" అనే మహావాక్యంతో ఆధ్యాత్మిక దిశానిర్దేశం చేసిన జగద్గురు ఆదిశంకరాచార్యులు హిందూ ధర్మ పరిరక్షణకు మార్గదర్శకుడని సంగారెడ్డి జిల్లా బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమ పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్ అన్నారు. మంగళవారం శంకరాచార్య జయంతి సందర్భంగా దత్తగిరి ఆశ్రమంలోని ఆలయంలో గల అద్దాల మండపంలో ప్రతిష్ఠితమైన ఆదిశంకరాచార్యుల విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శంకరాచార్యులు ప్రతిపాదించిన అద్వైత సిద్ధాంతం ద్వారా ప్రతి మనిషి తనలోనే పరమాత్మ స్వరూపాన్ని దర్శించగలడని, ఆత్మజ్ఞానం ద్వారానే మోక్ష మార్గం లభిస్తుందని అవధూత గిరి మహారాజ్ వివరించారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల మహామండలేశ్వర్ శ్రీ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ మాట్లాడుతూ.. శంకరాచార్యుల బోధనలు నేటి యువతకు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, ధర్మబద్ధమైన జీవనానికి ప్రేరణనిస్తాయని తెలిపారు. "భజగోవిందం" వంటి గ్రంథాల ద్వారా భక్తి, జ్ఞానం రెండింటినీ సమన్వయం చేసి సమాజానికి సరైన మార్గాన్ని చూపారని అన్నారు. వేద పాఠశాల విద్యార్థుల మంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆశ్రమం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజు, ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్ పాటిల్, బి. కృష్ణ, బోయిని ఎల్లన్న, తుకారాం, గణేష్ స్వామి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# చలివేంద్రాలు నిర్వహణలో నిర్లక్ష్యం వహించొద్దు

## కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలకు సిఫారసు చేస్తామని, కార్పొరేషన్ పరిధిలోని వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన చలివేంద్రాలను అధికారులు నిత్యం పర్యవేక్షించాలని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ హెచ్చరించారు. కార్పొరేషన్ కార్యాలయంలో తాగునీటి సరఫరా, చలివేంద్రాల నిర్వహణపై మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని నిత్యం అందుబాటులో ఉంచాలని, నీటిని అందించే వర్కర్లు చలివేంద్రాల వద్దే ఉండి సేవలు అందించేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలోని 11 ప్రధాన సెంటర్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, ప్రజల అవసరాల దృష్ట్యా మరిన్ని కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లలో ఎక్కడా తాగునీటి ఎద్దడి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక కృషితో అమృత్ స్కీం కింద మంజూరైన నిధులతో పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆయన వివరించారు. ప్రజలకు కనీస సౌకర్యాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి చుక్క నీరు సద్వినియోగం అయ్యేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని ఆయన పునరుద్ఘాటించారు.



# యువతను మత్తులో దించి అధికారం చెలాయిస్తున్న రాజకీయ నేతలు

### పి.వై.ఎల్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీనారాయణ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** దేశంలో,రాష్టంలో విచ్చలవిడిగా గంజాయి, మత్తు పదార్థాలు, మద్యం అమ్మకాలు సాగుతుంటే చోద్యం చూస్తూ యువతను ఆ మత్తులో మునిగేలా చేసి, రాజకీయ నేతలు తమ ప్రభుత్వాల వైఫల్యాలను కప్పిపుచ్చుతున్నాయని ప్రగతిశీల యువజన సంఘం పి.వై.ఎల్. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలా లక్ష్మీ నారాయణ అన్నారు. పి.వై.ఎల్. యాదాద్రి–భువనగిరి జిల్లా 9వ మహాసభను పోచంపల్లి పట్టణ కేంద్రంలోని రమాదేవి ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. మహాసభ ముందు బిగిపిడికిలి జండాను సంఘం జిల్లా అధ్యక్షులు మారుజోడు సిద్దేశ్వర్ ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కోలా లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ ?నేటి పాలకులు యువతను చైతన్యవంతులుగా తీర్చిదిద్దాల్సింది పోయి, వారిని మద్యం, గంజాయి, డ్రగ్స్ వంటి వ్యసనాల ఊబిలోకి నెట్టి తమ అధికారాన్ని కాపాడుకుంటున్నారని, యువత ప్రశ్నించే తత్వాన్ని కోల్పోయేలా చేసి, మత్తులో ముంచి పాలన సాగించడం పాలకుల కుట్రలో భాగమే అని, దేశంలో నిరుద్యోగం రికార్డు స్థాయికి చేరుకున్నా, ఉపాధి అవకాశాలు కల్పించకుండా కేవలం ఎన్నికల సమయంలో దొంగ హామీలతో యువతను మోసం చేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, నోటిఫికేషన్ల జాప్యంతో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలు అగమ్యగోచరంగా మారాయని,?ఈ విపత్కర పరిస్థితుల్లో యువతరం మేల్కోవాల్సిన సమయం ఆసన్నమైంది. కుల, మత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా, పాలకుల తప్పుడు వాగ్దానాలను నిలదీయాలనీ, కేవలం సోషల్ మీడియాకే పరిమితం కాకుండా, తమ హక్కుల కోసం క్షేత్రస్థాయిలో ఐక్యంగా పోరాడాలనీ, విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావడం లేదా కనీసం రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని, ప్రశ్నించే గొంతుకగా మారాలనీ, దేశ ప్రగతి యువత శ్రమశక్తిపైనే ఆధారపడి ఉందని గుర్తించి, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉజ్వల భవిష్యత్తు కోసం సిద్ధం కావాలనీ,యువత ఎదుర్కొంటున్న ఈ సమస్యలపై ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) నిరంతరం రాజీలేని పోరాటం చేస్తోందని, ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని, యువతను పట్టిపీడిస్తున్న మత్తు పదార్థాలను అరికట్టాలని, ఉచిత వైద్యం మరియు ఉపాధిని ప్రాథమిక హక్కుగా గుర్తించాలని, పి.వై.ఎల్. యువకులుగా పాలకుల దోపిడీ విధానాలకు వ్యతిరేకంగా, యువతను చైతన్యపరుస్తూ గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యమాలను ఉధృతం చేస్తామని, ఈ మహా సంగ్రామంలో యువతరం పెద్ద ఎత్తున కలిసిరావాలని, మన హక్కులను పోరాడి సాధించుకుందామని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ మహాసభలో ఏ.ఐ.కె.ఎం.ఎస్.రాష్ట్ర అధ్యక్షులు మామిడాల భిక్షపతి, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్.జనార్దన్, పి.వై. ఎల్. రాష్ట్ర సహాయ కార్యదర్శి బేజాడి కుమార్, కోశాధికారి డి.రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల శ్రీకాంత్,కోశాధికారి పగడాల శివ, పి.డి.ఎస్.యూ.జిల్లా కార్యదర్శి ఆర్.ఉదయ్, ఇఫ్టూ జిల్లా అధ్యక్షులు జి. నాగరాజు, గోరుగంటి ముత్యాలు, బాలకృష్ణ, పోతగాళ్ల నర్సింహ, సర్వన్, వెంకటేష్, మల్లేష్, సుధాకర్, ఆకుల కృష్ణ, శికిలం వెంకటేష్, మామిడాల భాను, గోరుగంటి నవీన్, శ్రీనాథ్, శివ, పాక నవీన్ తదితరులు పాల్గొన్నారు.







# గంగోత్రి వెంచర్ లో భూ కుంభకోణం.!

### 10% భూమిని కూడా ప్లాట్లు గా చేసి అమ్మకం చేసిన గంగోత్రి వెంచర్ యాజమాన్యం

### ఘాటుగా స్పందించిన సర్పంచ్ సట్లపల్లి గోవిందు గౌడ్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, షాద్నగర్ :**
నందిగామ మండలం తాళ్లగూడ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 490,527లలో గతంలో ఉమ్మడి కొత్తూరు మండలంలో 30 ఎకరాల గంగోత్రి వెంచర్ని నిర్మించారు. ఇందులో భాగంగా తాళ్లగూడ గ్రామపంచాయతీకి చెందిన 10% ల్యాండ్ 3 ఎకరాలు అప్పట్లో కేటాయించారు. కానీ రిజిస్ట్రేషన్ చేయించలేదు.ప్రస్తుత స్థానిక సర్పంచ్ సట్లపల్లి గోవింద్ గౌడ్ రిజిస్ట్రేషన్ చేయించమని గంగోత్రి యాజమాన్యాన్ని అడగగా తమకు కేటాయించిన మూడు ఎకరాల 10% ల్యాండ్ ని కూడా కబ్జా చేసుకొని ప్లాట్లుగా అమ్మేశామని మరియు ఆ ల్యాండ్ పై ఎల్ఆర్ఎస్ తీసుకున్నామని 10% ల్యాండ్ గురించి తమకు సంబంధం లేదని తేల్చి చెప్పినట్లు సమాచారం. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామపంచాయతీకి చెందాల్సిన భూమి రిజిస్ట్రేషన్ చేయకపోతే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. మరియు వెంచర్ లో ఉన్న పిల్లకాలువ (నాలా)ను కూడా కబ్జా చేసి ప్లాట్లుగా చేసినట్లు ఆయన తెలిపారు.ఇకనైనా గంగోత్రి యజమాన్యం స్పందించకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

# డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, నారాయణఖేడ్ :**
మానూర్ మండల పరిధిలోని తుమ్నూర్ గ్రామంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నారాయణఖేడ్ నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిలి ముఖ్య అతిథిగా విచ్చేసి, అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు గర్వించదగ్గ గొప్ప మేధావి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి, అంటరానితనం నిర్మూలనకు ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఆయన రాసిన రాజ్యాంగం వల్లే నేడు సామాన్యులకు సైతం సమాన హక్కులు, గౌరవం లభిస్తున్నాయని గుర్తు చేశారు.ప్రతి ఒక్కరూ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని, విద్యతోనే సమాజంలో గొప్ప మార్పు తీసుకురావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని, అది రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో సంజీవ్ గ్రామ సర్పంచ్, దత్తు బిరదర్ మానూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు,మోహన్ రెడ్డి, హన్మయ్య, భారత్, శ్రీశైలం, సర్పంచ్లు, బ్రహ్మానంద్ రెడ్డి మాజీ సర్పంచ్, అంబేద్కర్ విగ్రహా దాత మరియు స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ గ్రామాల నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

# పలువురు నాయకుల హౌస్ అరెస్ట్

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : రాజపేట క్రషర్ వ్యవహారంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల సవాల్ ప్రతి సవాల్ వ్యవహారంలో పరిస్థితి విషమించకుండా, లా అండ్ ఆర్డర్ కంట్రోల్ తప్పుతుందనే యోచనలో ఎస్ఐ లింగారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం పలువురు బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులను హౌస్ అరెస్టు చేశారు.

# పర్యావరణ హిత చర్యలతోనే భవిష్యత్ సురక్షితం : కలెక్టర్ ప్రావీణ్య




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, సంగారెడ్డి జిల్లా ప్రతినిధి:**
అంతర్జాతీయ మదర్ ఎర్త్ డే సందర్భంగా "99 రోజుల ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో రూపొందించిన గోడ పత్రికను మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ పాండు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. భూమిని కాపాడుకోవడం, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, పచ్చదనాన్ని పెంపొందించడం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచడం అత్యంత అవసరమన్నారు. ప్రకృతి సంపదను సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణహిత వస్తువులను వినియోగించడం, చెట్ల పెంపకం చేపట్టడం, నీటి వనరులను కాపాడుకోవడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, యువత పర్యావరణ పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని, అందరూ కలిసికట్టుగా కృషి చేస్తేనే భూమి సంరక్షణ సాధ్యమవుతుందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాండు, నేషనల్ గ్రీన్ కార్ప్స్ జిల్లా సమన్వయ కర్త మాధవ రెడ్డి, ఎస్‌జిఎఫ్ సెక్రటరీ శ్రీనివాస్ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


# వర్గల్ క్షేత్రంలో...వైభవంగా శంకర జయంతి మహోత్సవం

### ప్రత్యేక పూజలు చేసిన సరస్వతి పుత్రులు, సిద్ధాంతి చంద్రశేఖర శర్మ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, సిద్దిపేట జిల్లా :**
ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రంలో మంగళవారం శంకర జయంతి మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సరస్వతీ పుత్రులు, వాస్తు సిద్ధాంతి, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో వేద పండితులు ఆది శంకరుడి చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సిద్ధాంతి చంద్రశేఖర శర్మ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షకులు ఆదిశంకరాచార్యుడి బోధనలు ప్రతి ఒక్కరిని ఆధ్యాత్మిక భావన వైపు నడిపించినట్లు స్పష్టం చేశారు. నాస్తికత్వాన్ని రూపుమాపి సనాతన ధర్మం, వేద మార్గాన్ని ఆయన పునరుద్ధరించినట్లు గుర్తు చేశారు. ముఖ్యంగా జ్ఞాన పీఠాల స్థాపనతో భిన్నమైన ఆరాధనలు ఒకే పరమాత్మను చేరనున్నట్లు ఆదిశంకరులు ప్రపంచానికి చాటి చెప్పినట్లు వివరించారు. శంకర జయంతి సందర్భంగా బ్రహ్మశ్రీ, సిద్ధాంతి చంద్రశేఖర శర్మను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు.

# రహ్ వీర్ పథకం... ప్రమాద బాధితులకు సహాయం చేస్తే, రూ.25 వేల పారితోషికం.



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారికి తక్షణ సహాయం అందించే పౌరులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం రహ్ వీర్ పథకాన్ని అమలు చేస్తోందని జిల్లా ఎస్పీ నితికాపంత్ తెలిపారు. ప్రమాదం జరిగిన తొలి గంట "గోల్డెన్ అవర్" అని, ఈ సమయంలో సహాయం అందిస్తే అనేక ప్రాణాలు కాపాడవచ్చని పేర్కొన్నారు. పోలీస్ కేసుల భయంతో కొంతమంది సహాయానికి వెనుకంజ వేస్తున్నారని, ఆ భయాలు అవసరం లేదని స్పష్టం చేశారు. గాయపడిన వ్యక్తిని సమీప ఆసుపత్రికి తరలించిన వారికి రూ. 25,000 నగదు పారితోషికం, ప్రశంసా పత్రం అందజేస్తారని, సహాయం చేసిన వారిపై ఎలాంటి చట్టపరమైన చిక్కులు ఉండవని తెలిపారు.ప్రమాదం జరిగిన వెంటనే 108కు సమాచారం ఇచ్చి బాధితులను సమీప ఆసుపత్రికి తరలించాలని కోరారు.

# రైతుల కష్టాలకు చెక్... మన్నెగూడలో వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, మహబూబాబాద్ ప్రతినిధి:**
సీరోల్ మండలం మన్నెగూడెం గ్రామంలో రైతులకు ఊరటనిచ్చే విధంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశారు. మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ వరి కొనుగోలు కేంద్రాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు దళారుల చేతిలో మోసపోకుండా ప్రభుత్వం పండించిన ప్రతి గింజను కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతులు నేరుగా కొనుగోలు కేంద్రాలకు వచ్చి తమ పంటను విక్రయించుకోవాలని సూచించారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉందని, కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు. ఇదే సమయంలో మొక్కజొన్న రైతులు మహబూబాబాద్ మార్కెట్‌లో ఎదుర్కొంటున్న ఇబ్బందులపై పాలు దినపత్రికలలో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించి, మన్నెగూడెం గ్రామంలో ఐకేపీ సెంటర్ ద్వారా మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక రైతులకు పెద్ద ఊరటనిచ్చింది. ఈ కార్యక్రమంలో మన్నెగూడెం గ్రామ సర్పంచ్ కొండపల్లి లక్ష్మి, సీరోల్ తహసీల్దార్ పూర్ణచందర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొండపల్లి కరుణాకర్ రెడ్డి, వ్యవసాయ అధికారి చాయరాజ్, ఉప్పరగూడెం సర్పంచ్ మల్లికంటి సురేష్, అందనాలపాడు సర్పంచ్ రాము నాయక్, సొసైటీ సీఈవో రేళ్ల సతీష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నరసయ్యతో పాటు పలువురు రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధురాలు పద్మిని దేవి కన్నుమూత



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 21, మహబూబాబాద్ ప్రతినిధి:**
స్వాతంత్ర్య సమరయోధురాలు కొండపల్లి పద్మిని దేవి (87) మంగళవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఖమ్మం పట్టణంలోని మామిళ్లగూడెం నివాసంలో తుదిశ్వాస విడిచారు. మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని మన్నెగూడెం గ్రామానికి చెందిన ఆమె, మాజీ సర్పంచ్ స్వాతంత్ర్య సమరయోధుడు కొండపల్లి దామోదర్ రెడ్డి, సతీమణి. మరణానంతరం ఆమె భౌతిక దేహాన్ని స్వగ్రామమైన మన్నెగూడెం కు తరలించి, అక్కడ గ్రామస్తులు, బంధువులు, నాయకుల సమక్షంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాలోత్ నెహ్రూ నాయక్, కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతిని తెలియజేశారు. ఆమెకు పూలమాలలు అర్పించి ఘనంగా నివాళులు సమర్పించారు. పద్మిని దేవి కుమారులు, మహబూబాబాద్ జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొండపల్లి శ్రీనివాస్ రెడ్డి, కొండపల్లి రఘురాం రెడ్డి లను పలువురు నాయకులు పరామర్శించారు. అంత్యక్రియలలో మండల కాంగ్రెస్ నాయకులు, మన్నెగూడెం గ్రామ సర్పంచ్ కొండపల్లి లక్ష్మీ కరుణాకర్ రెడ్డి, డోర్నకల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డిఎస్ జగదీష్, బోడ రమేష్, మడికంటి నరసమ్మ, నరసయ్య, మాజీ ఎంపీటీసీ కొండపల్లి విజయపాల్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ మెరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గ్రామ ప్రజలు ఆమె సేవలను స్మరించుకుంటూ గౌరవంతో వీడ్కోలు పలికారు.

# డోర్నకల్‌లో విషాదం... సైదులు మృతి, నివాళులు అర్పించిన కాంగ్రెస్ నాయకులు



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 21, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ పట్టణంలోని గాంధీ సెంటర్ వద్ద నాయివృత్తి నిర్వహిస్తున్న ఆవుదుర్తి సైదులు మరణం స్థానికంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించిన డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు పూలమాలలతో నివాళులు ఘటించారు. ఈ సందర్భంగా డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాలా సుమేర్ జైన్, మాట్లాడుతూ, నాయి బ్రాహ్మణ సంఘంలో మంచి వ్యక్తిని కోల్పోవడం చాలా బాధాకరమని తెలిపారు. సైదులు సేవలు సమాజానికి ఎంతో ఉపయోగపడినవని, ఆయన స్మృతులు చిరస్థాయిగా నిలుస్తాయని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ కష్ట సమయంలో వారికి ధైర్యం చెప్పారు. సైదులు ఆత్మకు శాంతి చేకూరాలని, సద్గతి ప్రాప్తి చెందాలని దేవుడిని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ గుగులోత్ రాము, మైనారిటీ అధ్యక్షులు ఖాదర్ బాబా, కాలా ఆకాష్ జైన్, యువజన కాంగ్రెస్ నాయకులు దాసరి నాని యాదవ్, అశ్వక్, భీమన బోయిన సత్యనారాయణ, చిత్తలూరి వీరభద్రం, ఆవుదుర్తి మల్లికార్జున్, నాయిని వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే ట్రాక్ ప్రభావంతో భూములు నష్టపోతున్న గిరిజనులకు న్యాయం చేయాలి

### గిరిజన సంఘం జిల్లా నాయకులు మాలోత్ కిషన్ నాయక్ ఆవేదన





**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 21, మహబూబాబాద్ ప్రతినిధి:**
డోర్నకల్ పరిధిలోని సిగ్నల్ తండాలో గిరిజన సంఘం నాయకులు సందర్శించి, స్థానిక గిరిజనులతో సమావేశమయ్యారు. రైల్వే ట్రాక్ కింద భూములు క్రమంగా కూలిపోతుండటంతో తమ జీవనాధారం కోల్పోతున్నామని గిరిజనులు వేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో బాధితులతో కలిసి తహసీల్దార్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. భూములు కోల్పోయిన వారికి తక్షణమే సరైన నష్టపరిహారం అందించడంతో పాటు, సమస్యపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాలోత్ కిషన్ నాయక్ మాట్లాడుతూ, రైల్వే ట్రాక్ నిర్మాణం వల్ల నష్టపోయిన గిరిజన కుటుంబాలను ప్రభుత్వం విస్మరించకూడదని అన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అధికారులు వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బుక్య బుజ్జి, రమేష్ నాయక్, బుక్య సంధ్య, జరపల సౌందర్యతో పాటు తండా నాయకులు, పాల్గొన్నారు.

# ఇరాన్ నౌకలో చైనా సరుకు- ఉలిక్కిపడ్డ అమెరికా

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21 :**
ఇరాన్ కు చెందిన ఎంవీ తౌస్కా కంటైనర్ షిప్ ను అమెరికా స్వాధీనం చేసుకున్న అనంతరం అనూహ్య పరిణామాలు తలెత్తుతున్నాయి. దీని ప్రభావం ఈ రెండు దేశాల మధ్య జరగాల్సిన చర్చలపైనా పడుతుననాయి. ఉద్రిక్తతలు తీవ్రం అయ్యాయి. ఒమన్ గల్ఫ్‌లో ఈ నౌకను అమెరికా దళాలు అదుపులోకి తీసుకున్న ఈ నౌకలో చైనాకు చెందిన కొన్ని రకాల పదార్థాలు అక్రమంగా తరలిస్తోందనే అనుమానాలు వ్యక్తమౌతోన్నాయి. ఇది అమెరికాను ఉలిక్కిపడేలా చేసింది. ఇరాన్ కు పరోక్షంగా చైనా సహకరిస్తోందనే వాదనలు తలెత్తాయి.దీనిపై రిపబ్లికన్ నాయకురాలు నిక్కీ హేలీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఒమన్ గల్ఫ్‌లో అమెరికా నావికా దిగ్బంధనం తర్వాత చైనా నుండి వచ్చిన తొలి నౌక ఇరాన్ క్షిపణుల రసాయనాలను మోసుకెళుతుందని ఆమె పేర్కొన్నారు. ఇది విస్మరించకూడదని సూచించారు. దీనికి సంబంధించిన సమాచారాన్ని ఎక్స్ లో పోస్ట్ చేశారు. అమెరికా పట్టుకున్న నౌక చైనా నుండి ఇరాన్‌కు వెళుతోందని, క్షిపణుల రసాయన తయారీకి ఉద్దేశించిన కెమికల్స్ ఇందులో ఉన్నాయని తెలిపారు.ఇరాన్ కు చైనా పరోక్షంగా సహాయాన్ని అందిస్తోందని, దీనికి తాజా ఉదాహరణ ఇదేనని చెప్పారు. తమ దేశానికి వ్యతిరేకంగా చైనా.. ఇరాన్ ను ఎగదోస్తోందని మండిపడ్డారు. ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. మరోవంక.. తమ నౌకను అమెరికా స్వాధీనం చేసుకోవడాన్ని ఇరాన్ తప్పు పట్టింది. దీన్ని సాయుధ దోపిడీగా అభివర్ణించింది. అమెరికా చర్యలకు ప్రతీకారం ఉంటుందని హెచ్చరించింది.ఇస్లామాబాద్ చర్చలకు ముందు ఈ పరిణామం చోటు చేసుకోవడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దీని ప్రభావం చర్చలపై పడొచ్చనే ఆందోళనలు వ్యక్తమౌతోన్నాయి. తమ నౌకలపై దిగ్బంధనాన్ని ఎత్తివేసేంతవరకు ఇస్లామాబాద్‌లో అమెరికాతో రెండో రౌండ్ చర్చలకు హాజరుకాబోమని ఇరాన్ స్పష్టం చేసింది. దీనికి అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ససేమిరా అంటోన్నారు. దిగ్బంధనం విషయంలో వెనక్కి తగ్గబోనని, ఒప్పందం కుదిరిన తర్వాతే దీన్ని తొలగిస్తానని తేల్చి చెప్పారు. వాల్ స్ట్రీట్ జర్నల్ కథనం ప్రకారం.. ఒమన్ గల్ఫ్‌లో స్వాధీనం చేసుకున్న ఈ ఎంవీ తౌస్కా షిప్.. తరచుగా చైనా రాకపోకలు సాగిస్తుంటుంది. దీనిపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి కార్యక్రమం కోసం రసాయనాలు రవాణా చేస్తోందని ఆరోపణలు ఉన్నాయి. గత ఆరు వారాల్లో ఈ నౌక రెండుసార్లు చైనాను సందర్శించిందని డేటా అనలిటిక్స్ కంపెనీ సిన్మాక్స్ ఉపగ్రహ ఫొటోల ద్వారా తేలింది. ఇందులో ఉన్న సరుకు ఏమిటనేది తెలియట్లేదు.



# చిన్నారి అన్నప్రసన్న వేడుకలో నెహ్రూ నాయక్ ఆశీస్సులు



**హైదరాబాద్ పల్స్, ఏప్రిల్ 21, మహబూబాబాద్ ప్రతినిధి:**
సీరోల్ మండలం ఉప్పరగూడం గ్రామంలో యువజన కాంగ్రెస్ నాయకులు అశోక్--సుజాత దంపతుల కుమారుడి అన్నప్రసన్న కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ సభ్యులు మాలోత్ నెహ్రూ నాయక్ ,ముఖ్య అతిథిగా హాజరై చిన్నారిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చిన్నారి ఆరోగ్యంగా, సుఖసంతోషాలతో ఎదగాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులను అభినందించిన ఆయన, ఇటువంటి శుభకార్యాలు కుటుంబ బంధాలను మరింత బలపరుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను ఆనందంగా జరుపుకున్నారు.

# వేడి గాలుల పట్ల జాగ్రత్త వహించాలి

**ఉపాధి హామీ పని ప్రదేశాన్ని పరిశీలించిన కలెక్టర్ హరిత**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం చింతగూడ గ్రామ శివారులో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పని ప్రదేశాన్ని మంగళవారం కలెక్టర్ హరిత పరిశీలించింది. స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారి, ఈజీఎస్, ఏపీఓలు వెంట ఉన్నారు. గ్రామంలో అర్హులైన కూలీల సంఖ్య, పనికి హాజరవుతున్న వారు, రాలేకపోతున్న కారణాలపై ఈజీఎస్ సిబ్బందిని అడిగి వివరాలు సేకరించింది. అర్హులైన ప్రతి కూలీకి పని కల్పించాలని, పని ప్రదేశంలో త్రాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలని ఆదేశించింది.గత వారం నుండి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయని, వేడి గాలుల పట్ల ఉపాధి హామీ కూలీలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ఈజీఎస్ సిబ్బంది, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

# జగిత్యాలలో జైత్ర యాత్రకు బయలుదేరిన ధన్వార్ మరియు ఉసిరికపల్లి బిఆర్ఎస్ నాయకులు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, నారాయణ ఖేడ్ :**
గుర్రపు మచ్చందర్ ఆదేశాల మేరకు ధన్వార్ మరియు ఉసిరికపల్లి గ్రామాలకు చెందిన బి ఆర్ యస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు జగిత్యాలలో జరగనున్న జైత్ర యాత్రకు బయలుదేరారు. పార్టీ పిలుపు మేరకు పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి జైత్ర యాత్ర దోహదపడుతుందని తెలిపారు. గుర్రపు మచ్చందర్ నాయకత్వంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ స్థాయి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాలు, సైబర్ క్రైమ్స్ బారిన పడకుండా

# జిల్లా ప్రజలకు నిత్యం అవగాహన కల్పించాలి

**సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి**

**ఎస్పీ రోహిత్ రాజు**




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని పోలీసు అధికారులతో మంగళవారం నేర సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలు నందు అధికారులతో సమావేశమయ్యారు. ముందుగా విధులు నందు ఉత్తమ ప్రతిభను కనబరిచి రివార్డులను అందుకున్న పోలీస్ అధికారులను, సిబ్బందిని అభినందించారు.అదే విధంగా పలు కేసులలో సమగ్ర విచారణ జరిపి నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసిన పోలీసు అధికారులు సిబ్బందికి ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అక్కడ నివారణా చర్యలను చేపట్టాలని సూచించారు. అనంతరం అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన పెండింగ్లో ఉన్న పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి కేసులో సమగ్ర దర్యాప్తును చేపట్టి ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని తెలిపారు. పోక్సో కేసులలోని నిందితులకు త్వరతగతిన శిక్ష పడే విధంగా కృషిచేయాలని సూచించారు. గంజాయి అక్రమ రవాణా, మట్కా, క్రికెట్ బెట్టింగులు లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సామాన్య ప్రజానీకానికి ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించే వ్యక్తుల పట్ల కఠినంగా వ్యవహరించాలని అన్నారు.అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి ప్రదేశంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునే విధంగా చేసి నేరాల నియంత్రణకు పాటుపడాలని అన్నారు.వేసవి కాలం సెలవుల దృష్ట్యా దొంగతనాలు జరగకుండా గస్తిని పెంచి పెట్రోలింగ్,బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఉండాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా నిత్యం వాహన తనిఖీలు చేపడుతూ మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.షీ టీమ్స్, భరోసా కేంద్రాల ఆవశ్యకత గురించి అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి భాధిత మహిళలకు అండగా ఉండాలని ట్వలిపారు.ఈ సమావేశంలో పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి,డీసిఆర్బీ డిఎస్పీ మల్లయ్య స్వామీ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,డీసిఆర్బీ సీఐ సర్వయ్య ,సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఐటీ సెల్ ఇన్స్పెక్టర్ రాము,ఏవో మంజ్యా నాయక్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## స్పష్టమైన ప్రణాళికతో విద్యా సంవత్సరాన్ని

# ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలి


**జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, భద్రాద్రి జిల్లా ప్రతినిధి :**
ఈ విద్యా సంవత్సరం జరిగిన ప్రగతిని సమీక్షించుకొని స్పష్టమైన ప్రణాళికతో వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి బి. నాగలక్ష్మి అన్నారు. జిల్లా విద్యాశాఖ మండల విద్యాశాఖ అధికారులు, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు తో మంగళవారం రోజు కలెక్టరేట్ మీటింగ్ హాల్లో జరిగిన సంవత్సరాంత సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ ఎల్ ఎన్ ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం లో జరిగిన ప్రగతిని లోటుపాట్లను సమీక్షించుకొని వచ్చే విద్యా సంవత్సరం ఉన్నతమైన ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. విద్యాశాఖలో జరిగే వివిధ కార్యక్రమాలైన పాఠశాల వారి విద్యార్థుల నమోదు, మూతబడిన పాఠశాలను తిరిగి తెరిపించడం, అదేవిధంగా గత సంవత్సరానికి ఈ సంవత్సరానికి నమోదులో మార్పు, పిల్లల ఆధార్ అపార్ పరిస్థితి, ప్రతి పాఠశాల యొక్క మౌలిక వసతుల లభ్యత మొదలగు అంశాలపై ప్రస్తుత స్థితిని తెలియజేస్తూ వచ్చే విద్యా సంవత్సరానికి ఎటువంటి లక్ష్యాన్ని నిర్దేశించుకుని పని చేయాలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. అదేవిధంగా పాఠశాలల్లో పెండింగ్లో ఉన్న మరమ్మతులు నిర్మాణ పనులపై కూడా ఆయా ఇంజనీరింగ్ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో కలిపి సమీక్ష చేశారు. ఈ సంవత్సరం ప్రాథమిక స్థాయిలో ఎఫ్ ఎల్ ఎన్ మరియు ఉన్నత స్థాయిలో అభ్యసన అభివృద్ధి కార్యక్రమం, మండల విద్యాశాఖ అధికారులు కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు పాఠశాలలను సందర్శించిన వివరాలు మొదలగు వాటిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి చూపించి ఈ సంవత్సరం ఫలితాలను బేరీజు వేసుకొని వచ్చే సంవత్సరం 100% ఫలితాలు సాధించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. పిల్లలు వేసవి సెలవులలో అభ్యసన ప్రక్రియకు దూరం కాకుండా ఉండటానికి వారికి 45 రోజులు పాటు ఎటువంటి రాత పనిని ఇవ్వాలో దిశా నిర్దేశం చేస్తూ పిల్లలందరూ ఈ రాత పనిలో నిమగ్నం అయ్యే విధముగా ఉపాధ్యాయులు కృషి చేయాలని, దానికై ప్రధానోపాధ్యాయులు మండల విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఒక కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని విద్యార్థుల్లో అభ్యసన లోపం లేకుండా చూడాలని కోరారు. వివిధ మండలాల్లో భవిత భవనాల నిర్మాణం లో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పాఠశాలలు పునః ప్రారంభం నాటికి పిల్లలకి అందించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, సమ్మిళిత విద్య కోఆర్డినేటర్ ఎస్ కే సైదులు, ప్లానింగ్ కోఆర్డినేటర్ ఎన్. సతీష్ కుమార్, బాలిక విద్యా కోఆర్డినేటర్ జే. అన్నామని, జిల్లాలోని మండల విద్యాశాఖ అధికారులు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్లు, విద్యాశాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

# పాక్‌కు ప్యాంట్ తడిచిపోయే వార్నింగ్: ఏడాది తర్వాత మళ్ళీ..




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21:**
"మానవత్వం హద్దులు దాటితే..మా స్పందన అత్యంత కఠినంగా ఉంటుంది. న్యాయం జరిగి తీరుతుంది. భారతదేశం ఎప్పటికీ మర్చిపోదు." - ఇది సరిహద్దులో ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న శత్రువులకు భారత సైన్యం పంపిన తాజా హెచ్చరిక. గతేడాది పహల్గామ్ అడవుల్లో జరిగిన పిరికిపంద ఉగ్రదాడికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా, భారత సైన్యం తన 'పటిష్ట సంకల్పాన్ని' సోషల్ మీడియా వేదికగా మరోసారి చాటిచెప్పింది. ప్రతీకారం అంటే ఎలా ఉంటుందో చూపించిన 'ఆపరేషన్ సిందూర్' దృశ్యాలను గుర్తు చేస్తూ ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టించింది.

**పహల్గామ్ గాయం.. ఆపరేషన్ సిందూర్ మంట!**
సరిగ్గా ఏడాది క్రితం, ఏప్రిల్ 22, 2025న పహల్గామ్‌లో ఉగ్రవాదులు ఘాతుకానికి ఒడిగట్టారు. అయితే, భారత్ ఈసారి కేవలం ఖండనలతో సరిపెట్టుకోలేదు. దాడి జరిగిన రెండు వారాలకే.. అంటే మే 6-7 తేదీల్లో అర్ధరాత్రి వేళ భారత సైన్యం ' ఆపరేషన్ సిందూర్' పేరుతో ప్రళయంలా విరుచుకుపడింది. పాక్ ఆక్రమిత కాశ్మీర్ (గ్రాశీఖ) లోని ఉగ్రవాద శిబిరాలపై ఖచ్చితత్వంతో కూడిన దాడులు నిర్వహించి, శత్రువు కోటలను మట్టికరిపించింది.

**100 మంది ఉగ్రవాదుల ఖతం.. పక్కా స్కెచ్!**
'ఆపరేషన్ సిందూర్' భారత సైన్యం యొక్క వ్యూహాత్మక విజయానికి నిదర్శనంగా నిలిచింది. తొమ్మిది ప్రధాన ఉగ్రవాద శిబిరాలను లక్ష్యంగా చేసుకున్న ఈ దాడుల్లో జైషే మహ్మద్, లష్కరే తోయిబా, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థలకు చెందిన 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. ఇందులో కేవలం ఉగ్రవాదులే కాకుండా, వారికి శిక్షణ ఇచ్చే మాస్టర్ మైండ్లు, సూత్రధారులు కూడా ఉండటం గమనార్హం. పౌరులకు ఎటువంటి హాని కలగకుండా, కేవలం ఉగ్రవాద స్థావరాలనే ధ్వంసం చేయడం ద్వారా భారత్ తన సైనిక పటిమను ప్రపంచానికి చాటింది.

**"కొన్ని హద్దులు దాటకూడదు"**
సైన్యం తాజాగా షేర్ చేసిన పోస్ట్‌లో "కొన్ని హద్దులను ఎప్పటికీ దాటకూడదు" అనే సందేశం పాకిస్థాన్‌కు నేరుగా ఇచ్చిన వార్నింగ్‌గా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకున్నా, ఉగ్రవాదంపై పోరులో భారత్ అణుమాత్రం కూడా వెనక్కి తగ్గదని, మరోసారి అలాంటి ప్రయత్నం చేస్తే పరిణామాలు మరింత తీవ్రంగా ఉంటాయని సైన్యం స్పష్టం చేసింది.భారతదేశం ఏకతాటిపై నిలబడి ఉగ్రవాదాన్ని తుదముట్టించే వరకు విశ్రమించదని సైన్యం చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది కేవలం స్మరణ మాత్రమే కాదు.. శత్రువుకు హెచ్చరిక!

# కంగ్టిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, నారాయణఖేడ్ :** నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. వారు ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ అంబేద్కర్ సేవలను స్మరించారు. అంబేద్కర్ దేశానికి గర్వకారణమని, ఆయన అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని నాయకులు పేర్కొన్నారు. విద్యావంతులై, సంఘటితమై హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి అపారమని, రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అంబేద్కర్ దేశానికి గర్వకారణమని, ఆయన అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని నాయకులు పేర్కొన్నారు. విద్యావంతులై, సంఘటితమై హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి అపారమని, రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అంబేద్కర్ దేశానికి గర్వకారణమని, ఆయన అందించిన రాజ్యాంగం ప్రపంచంలోనే గొప్పదని నాయకులు పేర్కొన్నారు. విద్యావంతులై, సంఘటితమై హక్కుల సాధన కోసం ముందుకు సాగాలని యువతకు పిలుపునిచ్చారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి అపారమని, రాజ్యాంగం ద్వారా అందించిన హక్కులను



కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కమిషన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, దళిత సంఘాల ప్రతినిధులు, మేధావులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

# తలకిందులుగా వేలాడదీసి, బుద్ధి చెబుతాం

### టీఎంసీ నేతలకు అమిత్ షా తీవ్ర హెచ్చరిక

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, సెంట్రల్ బ్యూరో :** పశ్చిమ బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. అధికార తృణమూల్ కాంగ్రెస్ లక్ష్యంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్ర విమర్శలు గుప్పించారు. మంగళవారం డార్జిలింగ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ.. మే 5 తర్వాత బెంగాల్ పౌరులను, ముఖ్యంగా కొండ ప్రాంత ప్రజలను ఎవరైనా ఇబ్బంది పెడితే టీఎంసీ గూండాలను తలకిందులుగా వేలాడదీసి, సరిచేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. మమతా దీదీకి వీడ్కోలు పలికే సమయం ఆసన్నమైందని ఆయన అన్నారు. ఈ సభలో అమిత్ షా బెంగాల్ ఓటర్లపై వరాల జల్లు కురిపించడంతో పాటు, మమత సర్కారుపై కీలక ఆరోపణలు చేశారు.

**గూర్ఖాల సమస్య పరిష్కారం..**

'బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలు, నిరుద్యోగ యువత ఖాతాల్లో ప్రతి నెలా రూ. 3,000 చొప్పున జమ చేస్తాం. తేయాకు తోటల్లో పాఠశాలల నిర్మాణం చేపడతాం. కార్మికులకు భూమి పట్టాలు ఇచ్చి యజమానులను చేస్తాం. రాబోయే రెండేళ్లలో వారి వేతనాన్ని రూ. 500కు పైగా పెంచుతాం. దశాబ్దాలుగా ఉన్న గూర్ఖాల సమస్య పరిష్కారానికి కేంద్రం మూడు సార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా మమత ప్రభుత్వం సహకరించలేదు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడగానే గూర్ఖాల ఆకాంక్షల మేరకు ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తాం.' అని ప్రధాన హామీలు అమిత్ షా వివరించారు.

**మమత సర్కారుపై విమర్శలు..**

గిరిజనులు, ఉత్తర బెంగాల్, డార్జిలింగ్ ప్రాంతాల అభివృద్ధికి కేవలం రూ. 2 వేల కోట్లు కేటాయించిన మమత సర్కార్.. మదర్సాలు, ముస్లింల కోసం ఏకంగా రూ. 5,700 కోట్లు కేటాయించి తీవ్ర వివక్ష చూపుతోందని ఆరోపించారు. సందేశ్‌ఖాలీ ఘటన యావత్ బెంగాల్‌కే అవమానకరమని, టీఎంసీ పాలనలో మహిళలపై అకృత్యాలు పెరిగాయని, బీజేపీ అధికారంలోకి వస్తే నిందితులను ఏరికోరి జైలుకు పంపుతామని అన్నారు.



కాగా, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీకి ఏప్రిల్ 23, 29 తేదీల్లో రెండు విడతల్లో పోలింగ్ జరగనుండగా, మే 4న ఓట్ల లెక్కింపు (కౌంటింగ్) నిర్వహించనున్నారు. 2011 నుంచి అధికారంలో ఉన్న మమతా బెనర్జీని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ వ్యూహాలు రచిస్తుండగా, బీజేపీని 'బయటి వ్యక్తుల పార్టీ'గా ముద్ర వేస్తూ టీఎంసీ తన ఓటు బ్యాంకును కాపాడుకునే ప్రయత్నం చేస్తోంది.

### ఆర్ఎస్ఎస్ 100 శతాబ్ది ఉత్సవంలో భాగంగా

# రాజపేటలో హిందూ సమ్మేళనం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**

రాజపేట మండల కేంద్రంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం 100 శతాబ్ది ఉత్సవంలో భాగంగా హిందూ సమ్మేళనం నిర్వహించడం జరిగింది. ముందుగా పట్టణ కేంద్రంలో పుర విధులలో బైక్ ర్యాలీ నిర్వహించి, రాజపేట మండల కేంద్రానికి చెందిన ప్రేరణి నృత్యం , మరియు పట్టణ కేంద్రానికి చెందిన గాయని ద్వారా భక్తి పాటలు, హనుమాన్ భక్తులతో హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీ వెంకటేశ్వర భక్తిజన మండలి ద్వారా వెంటేశ్వర పారాయణం, మరియు స్కూల్ విద్యార్థులు ద్వారా నృత్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా పులిగిల్ల నరసింహులు ముఖ్య అతిథి బ్రాహ్మ శ్రీ శ్రీనివాస శర్మ, ముఖ్య వక్త నల్లగొండ విభాగ ప్రచారకులు కాసం సత్యనారాయణ మహిళా వక్త సేవిక సమితి భాగ్యనగర విభాగ అడ్వకేట్ కాసుల మానస అన్ని గ్రామాల ప్రజలు, సీనియర్ సిటిజన్స్ అన్ని పార్టీల నాయకులు హిందూ బంధువులు అందరూ పాల్గొన్నారు. ముఖ్య అతిథి మాట్లాడుతూ దేశంలో హిందూ సమాజం పై ఏదైనా దుర్ఘటన జరిగితే దేశ ప్రజలందరూ కులాలు పక్కనపెట్టి మన ధర్మం కోసం పనిచేయాల్సిన అవసరం ఉన్నది మన పిల్లలకి దైవభక్తి మరియు దేశభక్తి నేర్పవలసిన అవసరం ఉన్నది ఏప్పుడైతే హిందూ సమాజం చైతన్యవంతంగా ఉంటుందో అప్పుడే దేశం మొత్తం సుభిక్షంగా ఉంటుంది దేశం సుభిక్షంగా ఉంటే ఈరోజు ప్రపంచ దేశాలన్నీ సస్యశ్యామలంగా ఉంటయి భారత దేశం ప్రపంచానికి విశ్వ గురువుగా ఉంటుంది అని అన్నారు.



## పరిశ్రమల భద్రతపై మాక్ డ్రిల్.. ఇళ్ల గణన శిక్షణకు కలెక్టర్ హరిత హాజరు



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్‌లోని సిర్పూర్ పేపర్ పరిశ్రమలో మంగళవారం మాక్ డ్రిల్ కార్యక్రమం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం పరిశ్రమల శాఖ ప్రజపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా దీన్ని నిర్వహించింది. కలెక్టర్ హరిత, నిజామాబాద్ డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ సి.హెచ్. లక్ష్మీకుమారి, ఎస్పీఎం వైస్ ప్రెసిడెంట్ ఏ.కే. మిశ్రాలు పాల్గొన్నారు. పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, క్లోరిన్, యాసిడ్ వంటి విషపూరిత పదార్థాలు లీకేజీ కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత తెలిపింది. అకస్మాత్తు ప్రమాదాలు సంభవిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని, సాంకేతిక నిపుణులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేసింది. ఎస్పీఎం జనరల్ మేనేజర్ ఎస్.ఎం. గిరి, సేఫ్టీ మేనేజర్ ఆర్. శ్రీనివాస్, కమర్షియల్ జీఎం అనిల్ కుమార్ తదితరులు హాజరయ్యారు. అనంతరం కాగజ్ నగర్ మున్సిపల్ కార్యాలయంలో జనాభా గణన ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ హరిత పాల్గొంది. మాస్టర్ ట్రైనర్లు చెప్పే అంశాలు శ్రద్ధగా నోట్ చేసుకోవాలని, అర్థం కాని విషయాలను వెంటనే శిక్షకుల దృష్టికి తీసుకెళ్లాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా ఇళ్ల గణన పూర్తిచేయాలని సూచించింది. గణాంక అధికారి గురువయ్య, మాస్టర్ ట్రైనర్లు ఉషన్న తదితరులు పాల్గొన్నారు



## ట్రాక్టర్ డ్రైవర్లు, కూలీల వేతనాల పెంపు కోసం సిఐటియు ధర్నా



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ కార్మిక శాఖ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ట్రాక్టర్ డ్రైవర్లు, దినసరి కూలీల వేతనాల పెంపు కోసం భారీ ధర్నా నిర్వహించారు. అనంతరం కార్మిక శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కార్యదర్శి రాజేందర్ మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఇసుక లోడుకు 500, కంకర మట్టికి 400, బోల్డర్‌కు 4,000, మొరం ట్రిప్‌కు 500, ఎర్రమట్టికి 600, సిమెంట్ ఇటుక లోకల్‌కు 700 మరియు డ్రైవర్లకు రోజుకు 600 వేతనం చెల్లించాలని కోరారు. గత వారం రోజులుగా పనులు నిలిపివేసి ఆందోళన చేపట్టినా కార్మిక శాఖ అధికారులు స్పందించలేదని మండిపడ్డారు. డ్రైవర్లు, కూలీలతో చర్చలు జరిపి న్యాయం చేయాలని, లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్, ట్రాక్టర్ డ్రైవర్ల యూనియన్ అధ్యక్షులు మల్లేశ్, కార్యదర్శి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ కార్మికుల ధర్నాకు సబ్ కలెక్టర్ సానుకూల స్పందన



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లకు వినతిపత్రం సమర్పించారు. జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్ కుమార్ మాట్లాడుతూ కాగజ్‌నగర్ డివిజన్‌లో పని ప్రదేశాల్లో మంచినీరు, టెంట్లు, మెడికల్ కిట్లు లేవని, మూడు నెలలుగా వేతనాలు బకాయి పడ్డాయని తెలిపారు. రెండు ఫోటోల విధానం వల్ల కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, దాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి కార్మికుకు సంవత్సరానికి కనీసం 200 పనిదినాలు కల్పించాలని కోరారు. సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల కార్మికుల డిమాండ్లు న్యాయమైనవని అంగీకరించారు. పని ప్రదేశాల్లో తక్షణం కనీస సదుపాయాలు కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని, మండల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్వయంగా పని ప్రదేశాలు సందర్శిస్తానని, ఇన్చార్జ్ ఎంపీడీవో గౌరీ శంకర్‌ను తక్షణం చర్యలు తీసుకోవాలని మందలించారు.

## పీపీఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదివి ఇంటర్‌లో స్టేట్ థర్డ్ ర్యాంక్ సాధించిన శ్రీతేజకు సన్మానం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:** కాగజ్‌నగర్ తీరందాస్ బస్తికి చెందిన గోమాస శ్రీతేజ వివేకానంద జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఎంపిసి గ్రూప్‌లో 1000కు 994 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో ర్యాంకు నిలబెట్టింది. పట్టణంలోని పీపీఆర్ మెమోరియల్ లైబ్రరీలో చదివి ఈ విజయం సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా సిర్పూర్ శాసనసభ్యుడు డా.పాల్వాయి హరీష్ బాబు కాగజ్‌నగర్ సర్సిల్క్‌లోని తన నివాసంలో శ్రీతేజను సన్మానించి అభినందించారు. ఆమె భవిష్యత్ చదువుకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

### భక్తులకు, దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్న

# వర్తక సంఘాన్ని రద్దు చేయాలి

### బిజెపి పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదగిరిగుట్ట బిజెపి పట్టణ శాఖ ఆధ్వర్యంలో కొండపైన వర్తక సంఘాన్ని రద్దు చేయాలని దేవదాయ ధర్మాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కమిషనర్ ని కలిసి వినతి పత్రం అందజేయడం జరిగింది. ఎన్నో ఏండ్లుగా కొండపైన దుకాణాలను ఏర్పాటు చేసుకొని వాటిని రెన్యువల్ చేస్తూ టెండర్ వేయకుండా వివిధ రాజకీయ పార్టీల, ప్రభుత్వ అధికారాన్ని అడ్డం పెట్టుకొని యాదాద్రి దేవస్థానం కు వచ్చే భక్తులను ఇబ్బంది పెట్టడమే కాకుండా దేవస్థానం ఆదాయానికి గండి కొడుతున్నటువంటి వర్తక సంఘాన్ని తక్షణం రద్దు చేయాలని స్థానిక యువకులకు ఉపాధి కల్పించాలని పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎండోమెంట్ చట్టం ప్రకారం ఒక దుకాణాన్ని కూడా ఇన్ని సార్లు రేన్యువల్ చేయడం చట్ట విరుద్ధం మరి చట్టాలు వీళ్లకు వర్తించావా...? రేన్యువల్ కోసం భారీ ఎత్తున డబ్బులు చేతులు మారేందుకు సమయం ఆసన్నమైందని ఈసారి గనుక షాపులను రెన్యువల్ చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి మందోజి నరేష్ శివరాత్రి శ్రీశైలం, బోగా అజయ్, శ్రీనాథ్, విజయ్, ప్రవీణ్ శ్యామ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు సంబంధం లేదు నిబంధనల ప్రకారమే పనులు

### శ్రీ కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్, యాజమాన్యం

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చెల్లూరు గ్రామ రెవెన్యూ పరిధిలోని 322 సర్వేనెంబర్ లోని శ్రీ కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్, శ్రీని డెవలపర్స్ పై, యాజమాన్యం పై, క్రషర్ విషయంలో, ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై వస్తున్న ఆరోపణలు మాకు తీవ్రంగా బాధ కలిగిస్తున్నాయని, బీర్ల ఐలయ్యకు క్రషర్ పనులకు ఎలాంటి సంబంధం లేదని ఈ నేపథ్యంలో అసలు వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం బాధ్యత అంటూ సంస్థ మేనేజింగ్ పార్ట్నర్లు కర్నాటి శ్రీదేవి కర్నాటి యశ్వంత్ లు వివరించారు. మంగళవారం వెంచర్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు చెప్పారు. 2019 ఏప్రిల్ నెలలో, శ్రీ కన్స్ట్రక్షన్స్ అండ్ డెవలపర్స్ పేరుతో 70 ఎకరాల భూమికి డీటీసీపీ ద్వారా లేఅవుట్ అనుమతులు పొందామని, లేఅవుట్ ప్రాంతంలో ఎక్కువగా రాయి ఉండటంతో, అభివృద్ధి పనుల కోసం బ్లాస్టింగ్ అవసరం ఏర్పడడంతో సంబంధిత అధికారుల నుండి అనుమతులు పొందినట్లు చెప్పారు. ఆ కారణంగా ఆధారాలు లేకుండా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పై క్రషర్ పనులతో సంబంధాలు ఉన్నాయని చెప్పడం భావ్యం కాదన్నారు. కాగా ప్రభుత్వం ద్వారా అన్ని రకాల అనుమతులు ఉన్నాయని చెప్పి ఎలాంటి పత్రాలు కూడా విలేకరులకు చూపకపోవడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. క్రషర్ లేఅవుట్ల వ్యవహారంలో విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు జవాబు చెప్పలేకపోయారు. మీడియా సమవేశంలో



చెప్పిన విషయాలు వాస్తవ దూరంగా ఉన్నాయని అనుమానాలు వచ్చే విధంగా వారు ప్రవర్తించడం విశేషం.

## జీవాలను పాక్షిక సాంద్ర పద్ధతిలో పెంచడం ద్వారా అధిక లాభాలు : డాక్టర్ యం.చంద్రారెడ్డి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** మన దేశంలో జనాభాతో పాటు రోజు రోజుకు మాంసాహారుల సంఖ్య కూడా పెరుగుతుంది, అలాగే గొర్రె, మేకల మాంసానికి ఎలాంటి మత పరమైన అవరోదాలు లేవు, అన్ని కాలాల్లో మంచి డిమాండ్ కూడా ఉన్నది, ఈ పరిస్థితులు దృష్ట్యా ఔత్సహికులు ఎంతో మంది జీవాల పెంపకాన్ని వాణిజ్యపరంగా పెంచేటందుకు ముందుకు వస్తున్నారు, అందులో భాగంగా రాజపేట మండలం కొత్తజాల గ్రామంలో ఠాగూర్ రాజేందర్ సింగ్ అనే రైతు పొట్టేలు పిల్లలను పెంచుతున్నారు, మండల పశు వైద్యాధికారి డాక్టర్ యం చంద్రారెడ్డి ఫార్మ్ ను సందర్శించి మేలు జాతి (గడ్డి జాతి, పప్పు జాతి ) బహువార్షిక పశు గ్రాసాలను పొట్టేళ్లకు మేపటం ద్వారా ఎలాంటి దాణ, దాణ దినుసులు వాడకుండా పాక్షిక సాంద్ర పద్ధతిలో జీవాలను మేపటం ద్వారా అధిక లాభాలను పొందవచ్చునని ఇచ్చిన సలహాలు, సూచనలతో పొట్టేలు పిల్లలను పాక్షిక సాంద్ర పద్ధతిలో జీవాల్ని కొద్ది సమయం నిర్ణీత ప్రదేశంలో పాక దగ్గరలోని పచ్చిక బయళ్ళు తిప్పి ఎక్కువ సమయం పాకలో ఉంచి మేలైన గడ్డి జాతి పశు గ్రాసాలైన సూపర్ నేపియర్, జొన్న మొక్కజొన్న రకాలు, పప్పు జాతి పశుగ్రాస రకాలైన దశరథ గడ్డి( హెడ్జ్ లూసర్నె ), లూసర్న్, స్వీట్ పొటాటో వంటి పశుగ్రాసాలు చాఫ్ కట్టర్ సహాయంతో చిన్న చిన్న ముక్కలుగా చేసి సమీకృతమైన పచ్చి మేత , శుభ్రమైన నీరు అందుబాటులో ఉంచుతున్నాడు, ఈ పద్ధతిలో పెంచటం వలన జీవాలకు అన్ని రకాల పోషక పదార్థాలు (మాంసకృతులు, పిండి పదార్థాలు, ఖనిజ లవణాలు,విటమినులు) సక్రమంగా అంది త్వరగా ఎదుగుతున్నాయి. పొట్టేలు పిల్లలు మంచి బరువు వస్తుంది, వ్యాధుల బెడద తగ్గుతుంది, ప్రతి పొట్టేలు పిల్లలను పరిశీలించడం లెక్కించడం, మందులు త్రాగించడం టీకాలు వేయడం తేలికగా ఉంటుంది, పచ్చిక బయళ్ళు తగ్గిపోతున్న ఈ రోజుల్లో, పాక్షిక సాంద్ర పద్ధతిలో ఆచరించడం వలన మేపుకొరత గురించి జీవాలు చాలా దూరం నడవడం వల్ల శక్తి కోల్పయే పరిస్థితి గురించి కంగారు పడాల్సిన అవసరం అంతగా ఉండదు. అదేవిధంగా అంటువ్యాధుల బెడద కూడా ఉండదు, ఈ పద్దతిలో పొట్టేలు పిల్లలను పెంచటం వలన తక్కువ సమయంలో అధిక బరువు పెరిగి , దాణ మీద పెట్టె ఖర్చులు తగ్గి అధిక లాభాలు వస్తాయి. మంగళవారం జిల్లా పశు వైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ యన్ మోతిలాల్ సందర్శించి ఈ రైతు పొట్టేలు పిల్లలను పాక్షిక సాంద్ర పద్ధతిలో పెంచడం ద్వారా అధిక లాభాలు ఉన్నాయని అదేవిధంగా జిల్లాలో ఉన్న గొర్రెల మేకల పెంపకదారులు ఈ పద్ధతి ద్వారా గొర్రెల మేకలను పెంచడం ద్వారా అధిక లాభాలుపొందటమే కాకుండా దాణ ఖర్చును తగ్గించుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పశు వైద్యశాల, భువనగిరి సహాయ సంచాలకులు డాక్టర్ కే.గోపిరెడ్డి, రైతులు కే రాంరెడ్డి, సంజీవరెడ్డి, టాగూర్ రాజేందర్ సింగ్ పాల్గొన్నారు.



## ఇరాన్‌తో డీల్ కోసం ఇస్లామాబాద్ వెళ్లనున్న ట్రంప్ !

వాషింగ్టన్: ఇరాన్‌తో జరిగే చర్చల్లో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పాల్గొనే అవకాశాలు ఉన్నాయి. ఇస్లామాబాద్‌లో జరిగే రెండో విడత చర్చల్లో ఆయన పాల్గొనే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. వ్యక్తిగతంగా కానీ, లేక వర్చువల్‌గా కానీ ఆయన ఆ చర్చలకు హాజరయ్యే అవకాశాలు ఉన్నట్లు రైటర్స్ మీడియా సంస్థ తన కథనంలో పేర్కొన్నది. ఇస్లామాబాద్‌లో రెండో విడత చర్చలు ఈ వారంలో జరగనున్న విషయం తెలిసిందే. అయితే ఇరాన్, అమెరికా దౌత్యవేత్తల మధ్య బుధవారం ఆ చర్చలు జరిగే అవకాశం ఉన్నది. ఒకవేళ ఒప్పందంపై సంతకం చేయాల్సి వస్తే, అప్పుడు ట్రంప్ ఆ డీల్ మీట్‌కు హాజరయ్యే ఛాన్సు ఉన్నట్లు రైటర్స్ సంస్థ తన రిపోర్టులో వెల్లడించింది. అన్నీ సజావుగా సాగుతున్నాయని, రేపు చర్చలు జరిగే అవకాశం ఉన్నట్లు ఓ పాకిస్థానీ అధికారి ఇచ్చిన సమాచారాన్ని ఆ మీడియా సంస్థ షేర్ చేసింది. టెహ్రాన్, వాషింగ్టన్ మధ్య కుదిరిన రెండు వారాల సీజ్‌ఫైర్ బుధవారంతో ముగియనున్నది. అయితే ఆ కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడించే అవకాశాలు లేవని ఇటీవల ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే.

## కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో ఐసీయు యూనిట్ ప్రారంభం



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ ఏరియా ఆసుపత్రిలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ సహకారంతో 15 పడకల ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌ను సిర్పూర్ శాసనసభ్యుడు డా.పాల్వాయి హరీష్ బాబు మంగళవారం ప్రారంభించారు. అదే కార్యక్రమంలో 10 కొత్త స్ట్రెచర్ బెడ్లు కూడా అందజేశారు.గత ఆరు నెలల్లో ఆసుపత్రి సేవలు గణనీయంగా విస్తరించాయని శాసనసభ్యుడు తెలిపారు. రోజువారీగా 300 మంది అవుట్‌పేషెంట్లు, 20 మంది ఇన్‌పేషెంట్లకు వైద్య సేవలు అందుతున్నాయి. నెలకు 50కి తక్కువ కాకుండా నార్మల్ డెలివరీలు జరుగుతున్నాయి. వివిధ విభాగాల స్పెషలిస్ట్ వైద్యులు కూడా అందుబాటులో ఉన్నారు.కేంద్ర ప్రభుత్వ కాయకల్ప స్కీమ్ కింద ఈ ఆసుపత్రి గుర్తింపు పొందే అవకాశం ఉందని, దానికోసం వైద్య సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. 100 పడకల కొత్త భవన నిర్మాణం వేగంగా సాగుతుందని చెప్పారు.డయాలసిస్ సేవల విస్తరణలో భాగంగా కాగజ్‌నగర్‌లో అదనంగా 5, సిర్పూర్‌లో 5, కౌటాల పీహెచ్‌సీలో 5, బెజ్జూర్ సామాజిక ఆసుపత్రిలో 5 పడకలు కొత్తగా మంజూరయ్యాయి. ఇప్పటికే నియోజకవర్గంలో 5 పడకల డయాలసిస్ సెంటర్ ఉంది. మొత్తంగా కొత్తగా 20 డయాలసిస్ పడకలు అందుబాటులోకి రానున్నాయి. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షాహిన్ సుల్తానా, కౌన్సిలర్లు, డీసీహెచ్‌ఎస్ డా.అవినాష్, ఆర్‌ఎంఓ డా.శ్రీధర్ బాబు తదితర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పోడు రైతులు బిఆర్ఎస్ రాష్ట్ర నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పణ



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్నగర్ మండలం పోడు భూముల సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన కార్యక్రమంలో రైతులు బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. గత 50 సంవత్సరాలుగా పోడు భూములు సాగు చేస్తున్నామని, ఇదే తమ ఏకైక జీవనాధారమని రైతులు కన్నీటితో విన్నవించుకున్నారు. పోడు సమస్య రైతుల జీవనంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, వారి హక్కుల పరిరక్షణకు పార్టీ కట్టుబడి ఉంటుందని ప్రవీణ్ కుమార్ హామీ ఇచ్చారు.కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, మండల అధ్యక్షులు, పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

### మల్లగూడెంలో

# హెల్త్ క్యాంప్

హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలం మల్లగూడెం గ్రామంలో మంగళవారం మెడికల్ క్యాంప్ జరిగింది. ఈ కార్యక్రమానికి, మల్లగూడెం సర్పంచ్ జన్నెపల్లి బాలరాజ్ రెడ్డి, ఉపసర్పంచ్ రెడ్డబోయిన కవిత రాజు, వార్డు సభ్యులు, నీల కనకమ్మ రాములు , గొడుగు బ్రహ్మయ్య, నీల జహంగీర్, గొడుగు కల్పన కనకయ్య, బోయిని నాగరాజు, పంచాయతీ కార్యదర్శి చక్రధారి, ఉషారాణి సులోచన, భాగ్యమ్మ, గ్రామ పెద్దలు, ప్రజలు మెడికల్ క్యాంపులో పాల్గొన్నారు.,

# కాగజ్‌నగర్ వెల్కమ్ హోటల్‌లో గ్యాస్ పేలుడుతో 5 గురికి గాయాలు




**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి:**
కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ పట్టణంలోని వెల్కమ్ హోటల్‌లో మంగళవారం ఉదయం జరిగిన గ్యాస్ పేలుడు సంఘటనలో ఐదుగురు హోటల్ కార్మికులు గాయపడ్డారు. వివరాల ప్రకారం, ఉదయం సుమారు 5:30 ఐదు నారా గంటల సమయంలో హోటల్‌లో సాంబారు వేడి చేసే క్రమంలో ఇండియన్ గ్యాస్‌కు సంబంధించిన కమర్షియల్ సిలిండర్ గ్యాస్ పైపు అకస్మాత్తుగా పేలి ముక్కలైంది. దీంతో మంటలు చెలరేగి అక్కడ పనిచేస్తున్న కార్మికులు మల్లయ్య, మొబీన్, సుభాష్, గౌస్, సురేష్‌లకు కాలిన గాయాలు అయ్యాయి.గాయపడిన వారిని వెంటనే స్థానికులు సమీపంలోని విజయ హాస్పిటల్‌కు తరలించారు. వీరిలో మల్లయ్య పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినారు. సంఘటన విషయం తెలిసిన వెంటనే రెవెన్యూ అధికారి ఇన్‌స్పెక్టర్ గోపాల్, రెవెన్యూ సిబ్బంది రషీద్, కాగజ్‌నగర్ టౌన్ సీఐ ప్రేమ్ కుమార్ తదితర పోలీసు సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్యాస్ పేలుడుకు గల కారణాలపై గ్యాస్ సిలిండర్ స్వాధీనం చేసుకొని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి.

# పండుగ వాతావరణంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభం

**పాల్గొన్న పిడి శ్రీరాములు బృందం**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి** : రాజపేట మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవం పండుగ వాతావరణంలో సాగింది. యాదాద్రి భువనగిరి జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి శ్రీరాములు, తహసిల్దార్ వల్లపు ప్రదీప్, ఎంపీడీవో నాగవేణి, రాజపేట మండల హౌసింగ్ ఏఈ వివేక్, ఆయా గ్రామాల సర్పంచులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవము గృహప్రవేశాలు నిర్వహించారు. కుటుంబ సభ్యులతో కలిసి భోజనాలు చేశారు పూజల్లో పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంతో సొంత ఇంటి కల నెరవేరిందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య లకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కోయ మధు, రంగా నరేష్, రాంజీ నాయక్, నరేష్ రాజపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడిగే పెంటయ్య గౌడ్, మీడియా ఇన్చార్జి ఇంజ నరేష్, రాజపేట ఉప సర్పంచ్ నమిల కేదారి గౌడ్, తదితరులున్నారు.

# విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు తొలగించాలని వినతి

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు గ్రామంలో విద్యుత్ స్తంభాలకు కేబుల్ వైర్లు ఉండటం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ కేబుల్స్ వల్ల విద్యుత్ శాఖ ఉద్యోగులు తమ విధులను ఆటంకం ఏర్పడుతుందని, షార్ట్ సర్క్యూట్లు ఇతర ప్రమాదాలకు దారి తీస్తుందన్నారు. ఉద్యోగులకు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీయవచ్చు అన్నారు. ఈ అనధికార కేబుళ్లను వెంటనే తొలగించకపోతే, విద్యుత్ చట్టం కింద అవసరమైన చర్యలు తీసుకుంటామని, ఎలాంటి పరిణామాలకైనా సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. రాజపేట ఏఈ కి, స్థానిక చల్లూరు లైన్‌మ్యాన్‌కు ఫిర్యాదులు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదని తక్షణమే జోక్యం చేసుకుని, సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాలని, కేబుళ్లను వెంటనే తొలగించాలని జి.శ్రీకాంత్ కోరారు

# అక్షయా తృతీయ సందర్భంగా సామూహిక పారాయణం

**జై శ్రీమన్నారాయణ భక్త బృందం ఆధ్వర్యంలో కార్యక్రమం**





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట** మండల కేంద్రానికి చెందిన జై శ్రీమన్నారాయణ భక్త బృందం అక్షయా తృతీయ పర్వదినం సందర్భంగా ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని చేపట్టారు. చామకూర మల్లారెడ్డి నివాసగృహంలో ప్రత్యేక పూజలు జరిపారు. కుటుంబ సభ్యులు సమీప నివాసితులు పాల్గొనగా జై శ్రీమన్నారాయణ భక్త బృందం పారాయణం నిర్వహించారు. లలిత విష్ణు సహస్ర పారాయణం గోవింద నామాలు మణిద్వీప వర్ణన పారాయణ కార్యక్రమాలు సామూహికంగా చేపట్టారు. అనంతరం అమ్మవారికి మంగళహారతి నైవేద్య సమర్పణ చేసి తీర్థ ప్రసాద వితరణ జరిగింది. ఈ కార్యక్రమంలో బిర్రు భాగ్యలక్ష్మి, భోగ లత, ఉప్పల స్వప్న, నాళ్ల పద్మ, బెజుగం స్వప్న, పుష్పలత బెజగం రాజేశ్వరి, పరమేశ్వరి, చామకూర అరుణ తదితరులున్నారు.

# అక్రమ వెంచర్లకు నోటీసులు జారీ

**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :**
రాజపేట మండలం నమిల గ్రామ రెవెన్యూ పరిధిలోని రెండు అక్రమ వెంచర్లకు కార్యదర్శి జమీల్ నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో లేఅవుట్ హద్దురాలను తొలగించాలని లేనిపక్షంలో గ్రామపంచాయతీ తరుపున తొలగించి అట్టి ఖర్చును వసూలు చేయనున్నట్లు సంబంధిత యజమానులకు నోటీసు ద్వారా హెచ్చరికలు జారీ చేశారు.

# భారతీయ జనతా పార్టీకి మహిళా రిజర్వేషన్ బిల్ పట్ల చిత్తశుద్ధి లేదు

**ఆరక్షన్ బిల్ ఆజ్ కరో అభి కరో నినాదంతో పోస్ట్ కార్డులపై సంతకాల సేకరణ**

**యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ**



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21,** యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : భారతీయ జనతా పార్టీకి మహిళా రిజర్వేషన్ బిల్ పట్ల చిత్తశుద్ధి లేదు అని యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో మహిళా రిజర్వేషన్ బిల్లును వెంటనే అమలు చేయాలంటూ మహిళా అరక్షన్ బిల్ ఆజ్ కారో అభి కరో అనే నినాదంతో పోస్ట్ కార్డు పై సంతకాల సేకరణ కార్యక్రమం యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ముదిరాజ్ భవనంలో పోస్ట్ కార్డు పై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించి పోస్ట్ కార్డుపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఢిల్లీ అడ్రస్కు పోస్ట్ కార్డులపై సంతకాలు చేసి పోస్ట్ ఆఫీస్ వెళ్లి పోస్ట్ చేయడం జరిగింది. మోడీ కి కౌంట్ డౌన్ మొదలైంది. భారత జాతీయ కాంగ్రెస్ "మహిళా వ్యతిరేక" పార్టీ అని, పార్లమెంటులో మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకుందని బీజేపీ ఒక అసత్య మరియు దురుద్దేశపూరిత ప్రచారాన్ని సాగిస్తోంది. ఇది భారతదేశ ప్రజలను తప్పుదోవ పట్టించే ఉద్దేశంతో చెప్పబడుతున్న ఒక పచ్చి అబద్ధం. వాస్తవానికి, మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటు 2023లోనే ఏకగ్రీవంగా ఆమోదించింది. ఇప్పుడు లోక్‌సభలో విఫలమైంది ఏమిటంటే మహిళా రిజర్వేషన్ల ముసుగులో, దేశ వ్యాప్తంగా పార్లమెంటు మరియు రాష్ట్ర శాసన సభల స్థానాల సంఖ్యను పెంచడానికి, నియోజకవర్గాల పునర్విభజ చేపట్టడానికి చేసిన ప్రయత్నమే అయినటువంటి 'రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు అని మహిళా రిజర్వేషన్ కొత్తగా తీసుకురావాల్సిన అవసరం లేదు. బిజెపి పార్టీ ప్రవేశపెట్టిన మూడు బిల్లులు మహిళా అంశం లేదు. డీలిమిటేషన్ పేరుతో మళ్లీ అధికారంలోకి రావడాం భారతీయ జనతా పార్టీ(బిజెపి) ప్రయత్నం చేస్తుందని మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టకుండా తప్పుదోవ పట్టిస్తుందని బిజెపి పార్టీ మహిళా లోకానికి క్షమాపణ చెప్పాలని యూపీఏ హయాంలో చేపట్టినటువంటి మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయడానికి మేము బిల్లు పెడుతున్నాము ఏ పార్టీ వారు సహకరించడం లేదని మీరు చెప్పడం సిగ్గుచేటు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పార్లమెంటు మరియు శాసన సభలలో ఉన్న స్థానాల సంఖ్య ఆధారంగానే, మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టడాన్ని, లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రయత్నాలను మేము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాము ఇటువంటి చర్యలు చిన్న రాష్ట్రాలను తీవ్రమైన ప్రతికూలతలోకి నెట్టివేస్తాయి, అంతేకాక దేశ సమాఖ్య స్వరూపాన్ని దెబ్బతీస్తాయి. ఈ ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తూ, ఈ అంశాన్ని కేవలం ప్రచార సాధనంగా వాడుకుంటూ, బీజేపీ తన చీకటి రాజకీయ ఎజెండాను అమలు చేస్తోందని స్పష్టమవుతోందని రాజకీయ అవసరాల కోసం రాజకీయ ఎత్తుగడల కోసం మహిళలని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయాలనుకుంటే భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీకి మనుగడ కరువవుతుందని నీలం పద్మ అన్నారు. ఈ కార్యక్రమంలో స్టేట్ సెక్రెటరీ పావని. జిల్లా ప్రధాన కార్యదర్శి పుష్ప కవిత.



డిసిసి అధికార ప్రతినిధి. తిరుమల కవిత.మండల్ బ్లాక్ అధ్యక్షులు సంగీత. యంజాల. కళ, ఎడమ పుష్ప, భోగ కల్పన, మమత. బి. కవిత. డి .సునీత, రాంపల్లి సంతోషి పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

# హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయం : సట్టు తిరుమలేష్



**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** రాజపేట మండలం చల్లూరు రెవెన్యూ పరిధిలో గల క్రషర్ అక్రమ మైనింగ్ వ్యవహారంలో ఇటీవల జరుగుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకొని బిఆర్ఎస్ పార్టీ గ్రీవెన్స్ లో వినతి పత్రం సమర్పించగా కాంగ్రెస్ పార్టీ సవాల్ ను స్వీకరించి మంగళవారం క్రషర్ వద్దకు బిఆర్ఎస్ శ్రేణులు వెళ్లకుండా పోలీసులు హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు న్యాయమని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు సట్టు తిరుమలేష్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అక్రమ మైనింగ్ విషయంలో పూర్తి ఆధారాలతో వెళ్లాలనుకున్న తమను పోలీసులు అడ్డుకున్నారని అన్నారు. ఈ సమావేశంలో మదర్ డైరీ డైరెక్టర్ సందిల భాస్కర్ గౌడ్, గుంటి మధుసూదన్ రెడ్డి, రఘునాథపురం సర్పంచ్ పల్లె సంతోష్ గౌడ్, నర్సాపూర్ మాజీ సర్పంచ్ నాగిర్తి గోపాల్ రెడ్డి, బొంగోని ఉప్పలయ్య గౌడ్, ఎస్సీ సెల్ మండల నాయకులు దగ్గుల విష్ణు, పులి చంద్రమౌళి, చింతల రాజు పాల్గొన్నారు.

# కైలాసపురం శ్రీ వాసవి, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు





**హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి :** యాదాద్రి భువనగిరి జిల్లా, కైలాసపురం కాచారం, డాక్టర్ వంగపల్లి ఆంజనేయస్వామి ఆధ్వర్యంలో శ్రీ వాసవి, శ్రీ రేణుక ఎల్లమ్మ ఆలయంలో వైశాఖ మాసం ప్రత్యేక పూజలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించి, అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ వ్యాపారవేత్త సిద్దిపేట వాస్తవ్యులు చింతా రాము స్వప్న దంపతులు సాఫ్ట్వేర్ అద్విత్ , సినిమా ప్రొడ్యూసర్ సామ శ్రీధర్, సిద్దిపేట జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలు సామ ప్రశాంతి, శ్రీమతి శకుంతల తదితరులు ప్రత్యేక వైశాఖ మాస ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. మంగళవారం ఆలయంలో అన్నదానం నిర్వహించిన వి.భరత్ కుమార్, రిజర్వ్ పోలీస్ కానిస్టేబుల్ బీచ్పల్లి. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మహబూబ్నగర్ డిసిసి ఈసీ మెంబర్ చెన్నారపు అనంతయ్య గుప్తా, మోటకొండూరు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రఘునాథ భాస్కర్ ని దంపతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆడెపు బాలస్వామి, హైదరాబాద్ చింతల్ నగర్ వాస్తవ్య, రాయల్ చాలెంజ్ వాటర్ బాటిల్స్ డిస్ట్రిబ్యూటర్ ఏ వేణుగోపాల్ లావణ్య , సిద్దిపేట వాస్తవ్యులు మార్కండేయ భక్తుడు ఉప్పరపల్లి రోహిత్ ఝాన్సీ, గౌడ సంఘ నాయకులు తూర్పు గూడెం వాస్తవ్యులు గుడిసెల యాదగిరి గౌడ్ జయమ్మ, నమస్తే తెలంగాణ ఆలేర్ టౌన్ విలేకర్ చింతకింది వెంకటేశ్వర్లు లత, ములకల శ్రీనివాస్ సుజాత, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్ వెంకారెడ్డి



హైదరాబాద్ పల్స్ న్యూస్, ఏప్రిల్ 21, యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి : రాజపేట మండలంలోని చల్లూరు, బొందుగుల, పారుపల్లి గ్రామాల పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం అదనపు కలెక్టర్ వెంకారెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. రైతులతో, నిర్వాహకులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేమశాతాన్ని ఆయనే స్వయంగా పరిశీలించారు. నిబంధనలకు లోబడి ధాన్యం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర పొందాలని ఈ సందర్భంగా రైతులకు సూచించారు. తన వెంట తహసిల్దార్ వల్లపు ప్రదీప్, ఆర్.ఐ నర్సింలు, పిఎసిఎస్ సెక్రటరీ సిల్వేరు శేఖర్ గౌడ్, తదితరులు ఉన్నారు.

Edited, Published and Owned by Konadoddi Naveen Kumar and Printed at Srinith Publications Falcon Printing Press #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. And Published from #1-2-201, Shop No.02, Khan Street Zaheerabad 502220.T.G. Editor's Konadoddi Naveen Kumar, Dr.Tadhkal Rahul Kumar Reg. No.TEL-TEL/2023/12249. Email.HyderabadPulse23@gmail.com, Web:www.HyderabadPulse.com, Cell: +91-94406 53413, +91-9989834020.